ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnol,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts

సంపుటి - 01 సంచిక -310 పేజీలు - 08 వెల - 06/- గురువారం 13 ఫిబ్రవరి 2025



# రాబోయే రోజుల్లో డేటానే సంపద

**రోజురోజుకూ సాంకేతికరంగం అభివృద్ధి**

**టెక్నాలజీని వినియోగించుకొని ప్రగతిని సాధించాలి**

**: ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు**

అమరావతి, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్): రోజురోజుకూ సాంకేతికరంగం అభివృద్ధి చెందుతుందని, దానికనుగుణంగా ఆలోచనాలు చేసినప్పుడే ప్రగతి పథంలో నడవగలుగుతామని ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నారు. ప్రస్తుతం ప్రపంచాన్ని ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) శాసిస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో డేటానే సంపద అవుతుందని ఆయన పేర్కొన్నారు. హెల్త్‌లో డేటా కింగ్‌గా కిమ్స్ చైర్మన్ బి. భాస్కర్ రావు తయారవుతారని ఆయన స్పష్టం చేశారు. బుధవారం గుంటూరులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..

మిగతా 2లో





# పవన్ కళ్యాణ్ దక్షిణాది ఆలయాల సందర్శన

2లో

- సనాతనధర్మ పరిరక్షణ యాత్రలో పవన్ కళ్యాణ్
- కేరళలో అగస్త్యమహర్షి ఆలయ సందర్శన
- దక్షిణాది రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాల సందర్శనకు బయల్దేరిన పవన్
- కేరళలోని అగస్త్య ఆలయం సందర్శన
- తన తాజా పర్యటనకు రాజకీయాలతో సంబంధంలేదని స్పష్టీకరణ

# జూన్ నాటికి మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి

**16,247 టీచర్ పోస్టుల భర్తీకి మార్చిలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్**

**జూన్ నాటికి నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్న పాఠశాల విద్యాశాఖ**

**జీఓ 117కు ప్రత్యామ్నాయం తీసుకొస్తామని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడి**

నిరుద్యోగులకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 16,247 టీచర్ పోస్టుల భర్తీకి మార్చిలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. జూన్ నాటికి నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపింది.

మిగతా 2లో



# ఫ్రాన్స్‌లో యుద్ధవీరులకు మోడీ నివాళి

**మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయానికి ప్రారంభం**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్): ఫ్రాన్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల అధికారిక పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారంనాడు పలు కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారు. దక్షిణ మార్సెయిల్‌లోని మజార్గ్యూస్ యుద్ధ శ్మశానవాటికను సందర్శించి మొదటి, రెండవ ప్రపంచ యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు.

మిగతా 2లో





# రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో విజయ్ పాల్ కు బెయిల్

**రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు**

**ఏ4గా ఉన్న సీఐడీ రిటైర్డ్ అదనపు ఎస్పీ విజయ్ పాల్**

**గుంటూరు జైల్లో రిమాండ్ లో ఉన్న వైనం**


**షరతులతో కూడిన బెయిల్ మంజూరు**

2లో

# సోమరులను తయారు చేస్తున్న ఉచిత పథకాలు

**కష్టపడకుండానే డబ్బులు వస్తే..పనిచేస్తారా**

**- పార్టీల ఉచిత హామీలపై సుప్రీం వ్యాఖ్యలు**



2లో

# మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమే.. అందరి లెక్కలు తేలుస్తా

**చంద్రబాబు మోసాలు ప్రజల్లో ఎండగట్టాల్సిందే**

**సూపర్ సిక్స్ హామీలపై చేతులెత్తేసిన చంద్రబాబు**

**రోజురోజుకూ ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత**

**గుంటూరు నేతల సమావేశంలో జగన్ కీలక వ్యాఖ్యలు**



అమరావతి, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్): ఎపి ప్రభుత్వం మీద వ్యతిరేకత రోజురోజుకీ పెరుగుతోందని వైఎస్ఆర్ సిపి పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని, అందరి లెక్కలు తేలుస్తామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలతో జరిగిన భేటీలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. సిఎం చంద్రబాబు నాయుడు మోసాలను ప్రజల్లో మరింత ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల హామిల్లో ఏవీ నెరవేర్చడం లేదని దుయ్యబట్టారు. మిగతాది 2లో...

# మోదీ 'క్లోజ్ ఫ్రెండ్' మనవాళ్లను బానిసల్లా చూస్తున్నాడు: ఖర్గే



**ఇటీవల అక్రమ వలసదారులను భారత్ తిప్పిపంపిన అమెరికా**

**ట్రంప్ తన 'క్లోజ్ ఫ్రెండ్' అని మోదీ చెప్పుకుంటున్నారన్న ఖర్గే**

**అందుకే రవాణా విమానంలో పంపించారంటూ ఎద్దేవా**

**భారత్ సొంత విమానం ఏర్పాటు చేయాలని డిమాండ్**

2లో


# పలు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ ప్రమాద ఘంటికలు...

## సీఎం చంద్రబాబు సమీక్ష

**పలు జిల్లాల్లో మృత్యువాత పడుతున్న కోళ్లు**

**బర్డ్ ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్న చంద్రబాబు**

**ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం**



2లో

# బడ్జెట్‌పై మంత్రులు, అధికారులతో బాబు సమీక్ష

**ఈ ఏడాది నుంచే సూపర్ సిక్స్ అమలుకు కసరత్తు**

అమరావతి, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్): వార్షిక బడ్జెట్‌పై ఇఎం చంద్రబాబు కసరత్తు మొదలు పెట్టారు. ఆయా శృాఖలకు కేటాయింపులు, ఆదాయం, వ్యయాలపై మదింపు చేపట్టారు. ఈనెల 28న ఉభయ సభల్లో 2025-26 వార్షిక బ్జడెట్ ప్రవేశ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటంతో వార్షిక బడ్జెట్‌పై సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో సమీక్షించారు. మిగతాది 2లో...



# రంజాన్ మాసంలో ఉద్యోగులకు గంట ముందస్తు అనుమతి.

**మార్చి 2 నుంచి 30 తేదీ వరకు అనుమతి సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మైనారిటీ మంత్రి ఫరూక్**



8లో

# రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో విజయ్ పాల్ కు బెయిల్

ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో సీఐడీ రిటైర్డ్ అదనపు ఎస్పీ విజయ్ పాల్ కు బెయిల్ లభించింది. విజయ్ పాల్ ప్రస్తుతం గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయనను ఈ కేసు ఎఫ్ఐఆర్ లో ఏ4 నిందితుడిగా పేర్కొన్నారు. ఆయనకు గుంటూరు స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కాగా, ఈ ఉదయం గుంటూరు కోర్టుకు రఘురామకృష్ణరాజు వచ్చారు. కస్టోడియల్ టార్చర్ కేసుకు సంబంధించిన ఓ అంశంపై కోర్టులో స్టేట్ మెంట్ ఇచ్చారు.

# జూన్ నాటికి మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

జీఓ 117కు ప్రత్యామ్నాయం తీసుకొస్తామని పేర్కొంది. గతంలో టీచర్లకు 45 రకాల యాప్ లు ఉండేవని, వాటన్నింటినీ కలిపి ఒకే యాప్ గా మార్చేశామని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. అలాగే త్వరలో టీచర్ల బదిలీల చట్టం తేనున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై బిల్లు పెడతారని ఆయన చెప్పారు. వీసీల నియామకం పూర్తయ్యాక అన్ని విశ్వవిద్యాలయాలకు ఏకీకృత చట్టం అమలు చేస్తామన్నారు. ఇక మార్చిలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్న విద్యాశాఖ.. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా ఉండేలా జాగ్రత్త పడుతోంది. కాగా, 16,247 ఉపాధ్యాయ పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ)- 7,725, సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)- 6,371, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ)- 1,781, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ)- 286, వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీ)- 132, ప్రిన్సిపాల్స్- 52 పోస్టులు ఉన్నాయి.

# సోమరులను తయారు చేస్తున్న ఉచిత పథకాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్):

ఉచిత పథకాలతో ప్రజల్లో కష్టపడే తత్వం పోతోందని, వారు పనులకు దూరంగా ఉంటున్నారని, రాజకీయ పార్టీల ఉచిత పథకాలను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు ఉచితాలను ప్రకటించే పద్ధతి మంచి కాదని వ్యాఖ్యానించింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఉచితాలపై ఈ వ్యాఖ్యలు చేసింది. 'ఉచిత పథకాలు మంచివి కావు. దురదృష్ట వశాత్తూ.. వీటి కారణంగా ప్రజలు కష్టపడి పని చేసేందుకు ఇష్టపడడం లేదు. ఉచితంగా రేషన్, డబ్బులు అందుతున్నాయి. ఎలాంటి పని చేయకుండానే డబ్బులు వస్తుండటంతోనే ఇలా జరుగుతోంది. ప్రజలకు సౌకర్యాలు అందించాలన్న ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే. కానీ, వారిని దేశ అభివృద్ధిలో భాగం చేయాలి. ఉచితాల ద్వారా అలా జరుగుతోందా..?ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటించే పద్ధతి సరైనది కాదు' అని జస్టిస్ బీఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్రప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన మిషన్‌ను పూర్తి చేసే పనిలో ఉందని.. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించేందుకు యోచిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఈసందర్భంగా ధర్మాసనానికి తెలిపారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. ఈ నిర్మూలన మిషన్ ఎంతకాలం పాటు పని చేస్తుందో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ పిటిషన్‌ను మరో ఆరు వారాల తర్వాత విచారిస్తామని వాయిదా వేసింది.

# బడ్జెట్‌పై మంత్రులు, అధికారులతో బాబు సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)


ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది నుంచి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని ఇప్పటికే ప్రకటించినందున బడ్జెట్‌లో అందుకు తగ్గ కేటాయింపులపై కీలకంగా చర్చించినట్టు తెలుస్తోంది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల అమలుకు ఈ ఏడాది నుంచే శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అటు పథకాలు, ఇటు అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ బడ్జెట్ కేటాయింపులు చేయడం సర్కార్‌కు సవాల్‌గా మారింది. సవాళ్లను అధిగమించాల్సిన అంశాలపై అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది.

# మోదీ 'క్లోజ్ ఫ్రెండ్' మనవాళ్లను బానిసల్లా చూస్తున్నాడు: ఖర్గే

అక్రమ వలసదారుల పేరిట అనేకమంది భారతీయులను అమెరికా ప్రభుత్వం సైనిక విమానంలో తిప్పిపంపడంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో స్పందించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు 'క్లోజ్ ఫ్రెండ్' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పుకుంటున్నారని, కానీ మోదీ 'క్లోజ్ ఫ్రెండ్' మనవాళ్లను బానిసల్లా చూస్తున్నాడని విమర్శించారు. అమెరికా నుంచి తిప్పి పంపిస్తున్న వారి పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని, అలాంటి వారిని తీసుకువచ్చేందుకు భారత్ సొంత విమానం ఏర్పాటు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. అమెరికా పర్యటనకు వెళ్లిన మోదీ ఈ అంశంపై ట్రంప్ తో మాట్లాడాలని అన్నారు. అమెరికా మనకు మిత్ర దేశం... నేను ఏ అంశాన్నయినా పరిష్కరించగలను అని చెప్పుకుంటున్న మోదీ... ఇప్పుడీ అంశాన్ని పరిష్కరించాలని సూచించారు.

మోదీ మాట ట్రంప్ వినేట్టయితే మనవాళ్లను ప్రయాణికుల విమానంలో కాకుండా ఇలా రవాణా విమానంలో ఎందుకు పంపించారని ఖర్గే ప్రశ్నించారు.

# ఫ్రాన్స్‌లో యుద్ధవీరులకు మోడీ నివాళి



(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని వెంట ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ కూడా హాజరయ్యారు. మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయాన్ని కూడా మోదీ, మాక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. కాంటినెంటల్ ఫ్రాన్స్‌లో తొలి భారత రాయబార కార్యాలయం ప్రారంభించడం ద్వారా ఇరుదేశాల మధ్య మరింత లోతైన సంబంధాలు ఏర్పడటంతో పాటు ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలు, మల్టీ డైమన్షనల్ రిలేషన్‌షిప్‌కు బలం చేకూరిందని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు. దీనికి ముందు పారిస్‌లో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌లో మాక్రాన్‌తో కలిసి సదస్సుకు మోద అధ్యక్షత వహించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఫ్రాన్స్ పర్యటన అనంతరం ప్రధాని అమెరికా పర్యటనకు బయలుదేరుతున్నారు. రెండో దఫా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టిన తర్వాత ఆదేశంలో మోదీ పర్యటించనుండటం ఇదే ప్రథమం.

# రాబోయే రోజుల్లో డేటానే సంపద

(మొదటి పేజీ తరువాయి)



2000 ఏడాదిలో కిమ్స్ తొలి ఆసుపత్రిని తాను ప్రారంభించానని ఆయన గుర్తు చేసుకున్నారు. 25 ఏళ్లలో 5 వేల బెడ్స్‌తో ఐదు రాష్ట్రాలకు కిమ్స్ విస్తరించిందని చెప్పారు. క్రమశిక్షణతోనే ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. సంస్థ బాగుండాలంటే.. అందులో పని చేసే వాళ్లు భాగస్వాములు కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. 1995లో తాను ఐటీ గురించి చెప్పానన్నారు. ఇప్పుడు ఏఐ గురించి చెబుతున్నానని పేర్కొన్నారు. భవిష్యత్తులో భారతీయులు అద్భుతాలు సృష్టించనున్నారని చంద్రబాబు తెలిపారు. జెనిటికల్ పరీక్షలు ద్వారా ఎటువంటి రోగాలు రాబోతున్నాయో కూడా భవిష్యత్తులో తెలియనుందన్నారు. అయితే హెల్త్ కాస్ట్ తగ్గాలని ఆయన పేర్కొన్నారు. ఆయుష్మాన్ భవలో భాగస్వాములమవుతామన్నారు. నేచురల్ ఫుడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నెంబర్‌వన్ చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ ఎనర్జీలో 1/3 ఏపీలో చేయబోతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ వాడే రోజు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఇక వాట్సాప్‌లోనే అన్ని సర్టిఫికేట్స్ పొందవచ్చునని చెప్పారు. వివిధ రంగంలో స్కిల్ డెవలప్‌మెంట్ చేయడానికి ముం దుకొచ్చే వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. సమర్థవంతమైన నాయకుడు, సుస్థిరపాలన ఉంటే అభివృద్ధి ఉంటుందన్నారు. 2019లో తెలుగు దేశం పార్టీ గెలిచి ఉంటే ఇంత విధ్వంసం జరిగి ఉండేదా? అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రశ్నించారు. ప్రాధాన్యత తెలియని వ్యక్తులు పాలన చేస్తే.. ఎలా ఉంటుందో ఎయిమ్స్‌కి నీళ్లు ఇవ్వలేక పోవడమే అందుకు నిదర్శమని ఆయన పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 300 పడకలతో స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటు చేసే దిశగా తాము ఆలోచన చేస్తున్నామని చెప్పారు. పేదలకు అందుబాటులో మెరుగైన పాలన ఇచ్చేలా తాము ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. 15 శాతం ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన వివరించారు. రాబోయే బడ్జెట్‌ను అందుకు అనుగుణంగా రూపకల్పన చేస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

## మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమే..

# అందరి లెక్కలు తేలుస్తా



(మొదటి పేజీ తరువాయి)

ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత రోజు రోజుకీ తీవ్రమవుతోందని జగన్ తెలియజేశారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై చంద్రబాబు చేతులెత్తేశారని విమర్శలు గుప్పించారు. అందుకే ఏవేవో సాకులు చెబుతూ..అవి ప్రజలు నమ్మేలా ప్రచారం చేస్తున్నారని జగన్ మండిపడ్డారు. చంద్రబాబు వంచన, దారుణ మోసాలను.. మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అందుకోసం రోజూ ప్రజల్లో ఉండాలని, ప్రజలతో మరింత మమేకం కావాలని జగన్ స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను గాలికి వదిలేసిన చంద్రబాబు ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో దారుణమైన పరిస్థితులు తప్పవని అన్నారు. '201924 మధ్య జగన్ 1.0 ప్రభుత్వం నడిచింది. ఆ టైంలో చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా పాలన నడిచింది. లంచాలకు తావు లేకుండా రూ. 2.71 లక్షల కోట్లు డీబీటీ చేశాం. కోవిడ్ వల్ల ఆదాయం తగ్గినా హామీలు అమలు చేశాం. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం. కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశాం. మనం చేసిన అభివృద్ధి ప్రజల కళ్ల ముందే ఉంది. ఇప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టారు. బాబు మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేశారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలు తిరోగమనంలో ఉన్నాయి. మన హయాంలోని పథకాలన్నీ రద్దు చేశారు. మొన్నటి ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చాయి. కూటమి కంటే మనకు 10 శాతం ఓట్లు మాత్రమే తగ్గాయి. కారణం.. వారిలా నేను అబద్దాలు చెప్పలేకోవడం, కానీ, జగన్.. కార్యర్తలు, ప్రజలందరి మనసులో ఉన్నాడు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీత ఉండాలి. మీ జగన్ మరో 25-30 సంవత్సరాలు రాజకీయాల్లో ఉంటాడు. మనం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాం. ప్రజల కోసం ఇన్ని బటన్లు నొక్కిన మనకే ఈ పరిస్థితి ఉంటే.. రేపు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన ఈ సర్కార్ పరిస్థితి ఏంటని అన్నారు. రాష్ట్రంలో స్కాంలు తప్ప ఏం జరగడం లేదు. దోచుకోవడం, పంచుకోవడమే జరుగుతోంది. ప్రశ్నిస్తున్నవారిపై 111 సెక్షన్ కేసులు పెడుతున్నారు. తీవ్రవాదులపై పెట్టే కేసులతో వేధించి జైళ్లలో పెడుతున్నారు. వైఎస్సార్‌సీపీ కేడర్ అరెస్టులకు భయపడొద్దు. మంచి పాలన చేస్తే ప్రజలు ఆదరిస్తారు. ఇలాంటి అన్యాయాలు చేస్తే ప్రజలే గుణపాఠం చెప్తారని అన్నారు. రాబోయేది జగన్ 2.0 పాలన. మళ్లీ అధికారంలోకి వస్తాం. అందరి లెక్కలు తేలుస్తాం. అన్యాయాలు ఎవరు చేసినా వదిలిపెట్టం. తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెడతాం. మన పాలనలో రెండున్నరేళ్లు కోవిడ్ ఉంది అందుకే కార్యకర్తలకు చేయాల్సింది చేయలేకపోయాం. జగన్ 2.0లో ప్రతీ కార్యకర్తకు తోడుంటాం. వాళ్ల ఇంటి పెద్దన్నగా వారికి తోడుగా ఉంటా' అని వైఎస్ జగన్ మరోసారి ఉద్ఘాటించారు. ఈ భేటీకి హాజరైన మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, విడదల రజని, ఎంపీ అయోధ్య రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి, కాసు, బొల్లా సహా నియోజకవర్గాల సమన్వయ కర్తలు తదితరులు హాజరయ్యారు. అలాగే.. ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్ పర్సన్లు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.





# సనాతనధర్మ పరిరక్షణ యాత్రలో పవన్ కళ్యాణ్

## కేరళలో అగస్త్యమహర్షి ఆలయ సందర్శన

కొచ్చి, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్):

తిరుమల లడ్డూ వివాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.. తిరుమల లడ్డూ వివాదం దురదృష్టకరం అని అన్నారు. ప్రస్తుతం సనాతన ధర్మ యాత్రలో ఉన్న పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆలయాల నుంచి ఎవరూ డబ్బులు ఆశించకూడదని.. కానీ అలా జరగకపోవడం బాధాకరమని అన్నారు. ఘటనకు బాధ్యులైన నిందితులు అరెస్టయ్యారని అన్నారు. తిరుమల కల్తీ నెయ్యి కేసులో ఇటీవల సీబీఐ నలుగురిని అరెస్ట్ చేసిన క్రమంలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.సనాతన ధర్మ యాత్రలో భాగంగా బుధవారం కేరళ, తమిళనాడులోని వివిధ పవిత్ర స్థలాలకు పవన్ కళ్యాణ్ తీర్థయాత్ర ప్రారంభించారు.ఈ సందర్భంగా తమిళనాడులోని పవిత్ర స్థలాలకు ఆధ్యాత్మిక యాత్రకు బయలుదేరారు. కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన తన ప్రయాణంలో శ్రీ అగస్త్య మహర్షి ఆలయాన్ని దర్శించుకొని.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పవన్ కళ్యాణ్ కేరళ పర్యటనకు వెళ్లారు. సనాతనధర్మ పరిరక్షణలో భాగంగా కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు ఆలయాలను పవన్ సందర్శించనున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఆయన కేరళలోని కొచ్చి సమీపంలో ఉన్న అగస్త్య మహర్షి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పవన్ కళ్యాణ్ వెంట ఆయన కుమారుడు అకీరానందన్, తితిదే బోర్డు సభ్యుడు ఆనంద్‌సాయి ఉన్నారు. బుధవారం సాయంత్రం తిరువనంతపురంలోని పరశురామ స్వామి ఆలయాన్ని పవన్ సందర్శించనున్నారు. మూడు రోజుల పర్యటనలో అనంత పద్మనాభస్వామి, మధుర మీనాక్షి, అగస్త్య జీవసమాధి, కుంభేశ్వర, స్వామిమలైయ్, తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు పవన్ వెళ్లనున్నారు. మూడు రోజుల పాటు కేరళ, తమిళనాడులోని పలు పుణ్య క్షేత్రాలను పవన్ కళ్యాణ్ దర్శించుకోనున్నారు. పవన్ కళ్యాణ్ నడుము నొప్పి బాధపడుతుండడంతో రాష్ట్రం సచివాలయంలో మంత్రులు, ముఖ్య కార్యదర్శులతో సిఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమావేశానికి ఆయన రాలేదు. మంత్రి నాదెండ్ల మనోహర్ కలుగ జేసుకొని పవన్ రెండు వారాలుగా తీవ్రమైన నడుము నొప్పితో బాధపడుతున్నారని, అందుకే సమావేశానికి రాలేదని చెప్పారు. రెండు మూడు రోజుల్లో విధులకు హాజరవుతారని వివరణ ఇచ్చారు. వెంటనే చంద్రబాబు స్పందించారు. పవన్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించానని, కానీ దొరకలేదని, ఇప్పుడెలా ఉన్నారని బాబు అడిగారు. కాస్త పర్వాలేదని మనోహర్ జవాబిచ్చారు.

# ఆయుష్మాన్ పై చర్యలు తీసుకునే వరకు పోరాడుతాం

## అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ అర్ధ నగ్న నిరసన ధర్నా-ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ







**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్)** ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల వైఖరిని నిరసిస్తూ కలెక్టర్ కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప అధ్యక్షతన అర్ధనగ్న ప్రదర్శనతో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర నగేష్ మాట్లాడుతూ అక్రమంగా వెంకటరమణ కాలనీలో పర్మిషన్ తీసుకొని గణేష్ నగర్ లోని సోమిశెట్టి కాలనీలో నిర్వహించడం, ప్రభుత్వం నిర్ణయించిన వాటికంటే అధికంగా ఫీజులు వసూలు చేయడం ప్రభుత్వం కన్వీనర్ కోటాలో చేరిన విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ కాలేజీ అకౌంట్ లో వేస్తానని చెప్పిన దానికి విరుద్ధంగా విద్యార్థులే కట్టాలని అహంకారంగా అడ్డగోలుగా విద్యార్థులను వేధించి వసూలు చేస్తున్నారని, తాజుద్దీన్ అనే విద్యార్థి 70 వేల రూపాయల ఫీజు కట్టినప్పటికీ రెండవ సంవత్సరం పరీక్షలు రాయనీయకుండా బయటికి గెంటి వేశాడని ఈ విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే దశలవారీగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని అవసరమైతే అక్రమంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాల ముందు ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ భాష ఉపాధ్యక్షులు వీరేష్, మహేష్ ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అబుబాకర్ నాయకులు పృద్వి యోగి ఎస్ఎఫ్ఐ టెక్నికల్ స్టూడెంట్స్ నెట్వర్క్ జిల్లా కన్వీనర్ అమర్, కో కన్వీనర్ మనోహర్, శంకర్ రజాక్ తరుణ్ మహబూబ్ సమీర్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# మా కుటుంబ సభ్యులు మరణించారు బతికున్న వారిమి వడ్డీలు చెల్లించ లేకున్నాం

**కేశవ రెడ్డి స్కూలు బాధితుల ఆవేదన**

**గత ప్రభుత్వం స్పందించలేదు:కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులను ఆదుకోవాలి**

**: పట్టణ పౌర సంక్షేమ సంఘం**



కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 12(రిపబ్లిక్ న్యూస్) పిల్లల చదువుల కోసం కేశవరెడ్డి స్కూలు యాజమాన్యం దగ్గర ఒక్కోరు రూ. లక్షల్లో డిపాజిట్లు చేసి ఏళ్లు గడుస్తున్నా.. మా కష్టాల గురించి కేశవరెడ్డి తో పాటు,ఏ అధికారి పట్టించుకోవడం లేదంటూ ఉమ్మడి జిల్లాకు చెందిన కేశవరెడ్డి బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు బాధితులు మాట్లాడుతూ మా ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యంతో కొందరు మరణించారని, బ్రతికున్నోల్లము వడ్డీలు చెల్లించలేక పస్తులుండే పరిస్థితి ఏర్పడిందని కేశవరెడ్డి స్కూలు నిర్వాహకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. డోన్ కు చెందిన రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ అప్పుల బాధ భరించలేక ఆవేదనతో మా కుటుంబంలో ఒకరు మరణించారని.. నేను బ్రతికుండగానైనా మా డబ్బులు మాకు ఇవ్వాలని కోరారు. నందికొట్కూరు కు చెందిన లలిత మాట్లాడుతూ నా భర్త అనారోగ్యానికి గురై నెలల తరబడి హాస్పిటల్ లో ఉండాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నామని బోరున విలపించారు. గీత అనే మరో మహిళ తన భర్త చనిపోయాడని ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్నారని కంటనీరు పెట్టారు. ఈ రకంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కేశవరెడ్డి స్కూలు బాధితులు ఒక్కొక్కరు వారి వారి ఆర్థిక ఇబ్బందులు తెలుపుతూ వారి గోడును ఎల్ల బోసుకున్నారు .అనంతరం సిఐడి కార్యాలయానికి వెళ్లి తమ ఆర్థిక ఇబ్బందులన్నీ తెలిపారు. డిపాజిట్లకు సంబంధించి కోర్టులో కేసు నడుస్తున్నదని.. పరిష్కారమైన వెంటనే మీకు సమాచారం అందిస్తామని సంబంధిత అధికారి అందుబాటులో లేరని క్రింది స్థాయి అధికారులు తెలిపారు. విషయం తెలుసుకున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి కేశవరెడ్డి బాధితులను వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ ప్రభుత్వం పట్టించుకోలేదని.. కూటమి ప్రభుత్వమైన స్పందించి కేశవరెడ్డి బాధితులకు ఆదుకోవాలని కోరారు.మీకు న్యాయం జరిగేంత వరకు మీ వెంట మేముంటామని బాధితులకు ధైర్యాన్ని నింపాడు. కేశవరెడ్డి బాధితులు జిలాని తోపాటు 20 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పి పి ఎస్ ఎస్ కార్యకర్తలు మహమ్మద్ యూనూస్, షేక్ అన్వర్ భాష తదితరులు పాల్గొన్నారు.

# ఎంసీపీఐ(యు) డివిజన్ ఆవిర్భావ మహాసభను జయప్రదం చేయాలని జీపు జాత బృందం ప్రచారం









పాములపాడు ఫిబ్రవరి 12 రిపబ్లిక్ న్యూస్:- నంద్యాల జిల్లా, నందికొట్కూరు డివిజన్ ఆవిర్భావ మహాసభ జయప్రదం చేయాలని జిప్ జాతర నందికొట్కూరు నుండి జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లె మండలలో, పట్టణంలో హాజీ నగర్, బిఆర్ఆర్ నగర్, జూపాడు బంగ్లా మండలంలోనీ, జూపాడుబంగ్లా, బన్నూరు పాములపాడు మండల కేంద్రంలో, మరియు కొత్తపల్లి మండలంలోని, లింగాపురం, శివపురం, ఎర్రమఠం, సంగమేశ్వరం మీదుగా గిరిజనులు ఉన్న బలపాల తిప్ప, జనాల గూడెంలను ఎం సిపిఐ యు పార్టీ జిల్లా కన్వీనర్ పి.లాజరస్, బృందం సందర్శించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఏం సిపిఐయు జిల్లా కన్వీనర్ పి.లాజరస్ మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలోని, శివపురంలో ఎస్సీ కాలనీలో నీట సమస్య తీవ్రంగా ఉన్నదనీ, ఆ గ్రామ సాగు భూములకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందుతలేదనీ, జానాల గూడెంలో భూమి సమస్య తీవ్రంగా ఉన్నది ఆధార్ కార్డు కూడా లేని వాళ్ళు విద్యుత్ కనెక్షన్ లేని గూడెం గిరిజనులు ఉన్నారన్నారు. కొత్తపల్లి మండలంలోని, గ్రామాల్లో నేటికీ కూలీలు 60% గ్రామాల్లో, గిరిజన గూడల్లో 90 శాతం వలసలు వెళ్లారన్నారు. గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కనుమరుగైందని పైఅధికారుల స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి, ఉపాధి హామీ పథకం అమలు చేయాలని ఆయన అన్నారు. సంగమేశ్వరం నుండి జానాల గిరిజన గూడెం వరకు నాణ్యమైన రోడ్డు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ లింగాల.శ్రీనివాసులు, పి.మద్రి స్వామి, ఏఐఎస్డిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దక్క.చిన్న కుమార్, వినయ్, తదితరులు పాల్గొన్నారు. ఈ జీపు జాతకు మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి. అంకన్న సంఘీభావం తెలిపారు.

# కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి హాల్ లో సైరిక్స్ హెల్త్ కేర్ బయో మెడికల్ వైద్య పరికరాలపై అవేర్నెస్





కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 12(రిపబ్లిక్ న్యూస్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి హాల్ లో సైరిక్స్ హెల్త్ కేర్ బయో మెడికల్ వైద్య పరికరాలపై క్రిటికల్ కేర్ ఎక్విప్మెంట్స్ పై యూజర్ ట్రైనింగ్ సేక్షన్ లో భాగంగా డీఫీబ్లెటర్ మరియు బిపి, ఇసిజి, మానిటర్స్ లకు ఆసుపత్రిలో ఉండే నర్సింగ్ సిబ్బందికి బయో మెడికల్ ఎక్విప్మెంట్ పై పేషంట్స్ కు ఏ విధంగా కనెక్ట్ చేయాలి వారికి అవగాహన ఉండేందుకు సైరిక్స్ సిబ్బందితో అవేర్నెస్ ప్రోగ్రాం చేయడం జరిగిందని అన్నారు.ఆసుపత్రిలోనీ పలు ఎమర్జెన్సీ విభాగాలలో ఉండే బయోమెడికల్ ఎక్విప్మెంట్ ప్రతిరోజు శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని నర్సింగ్ సిబ్బందికి ఆదేశించారు.ఆసుపత్రిలో ఉండే బయో మెడికల్ పరికరాల యొక్క రికార్డ్స్ ను ప్రాపర్గా మైంటైన్ చేయాలని నర్సింగ్ సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమానికి సిఎస్ఆర్ఎంఓ, డా.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్, సింధు సుబ్రమణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డా.శివబాల నగాంజన్, నర్సింగ్ సూపరింటెండెంట్, సావిత్రి బాయి, బయో మెడికల్ ఇంజనీర్, ఉమేష్, సైరిక్స్ హెల్త్ కేర్ సిబ్బంది విజయ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నోత్తరాల సమీక్ష సమావేశాన్ని జయప్రదం చేయండి



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్)** బేడ బుడగ జంగాల అను ప్రశ్నోత్తరాల సమీక్ష సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ కోరారు. శుక్రవారం రోజు 14వ తేదీ కర్నూల్ జిల్లా కలెక్టరేట్, పొదుపు భవనానికి జాతిలోని నిరుద్యోగులు, యువత, విద్యార్థులు పాల్గొని,ఎన్నాళ్ళు ఎన్నాళ్ళు ఇంకా ఈ జాతికి న్యాయబద్ధమైన రిజర్వేషన్ హక్కుల అందుకోకుండా నష్టపోదామా! మనం సాధించలేమన అనాలోచిత ఆలోచన విడిచి, మీ యొక్క సందేహాలు పరిష్కరించుకొని, జాతి ఉనికిని కాపాడాలని ఆయన పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

# జేఈఈ లో ఉత్తమ ఫలితాలు సాధించిన న్యూక్లియస్ కళాశాల.

## విద్యార్థులని అభినందించిన కళాశాల యాజమాన్యం.




నంద్యాల, ఫిబ్రవరి 12, రిపబ్లిక్ న్యూస్ :జేఈఈ ఫలితాల సందర్భంగా ఉత్తమ జేఈఈ ఫలితాలను సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎస్ మురళీధర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం అయిన మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ


ఉత్తమ విద్య కోసం ఇక నుండి విద్యార్థుల తల్లిదండ్రులు వ్యయ ప్రయాసల కోర్చి దూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం లేదని నంద్యాల న్యూక్లియస్ అకాడమీ ద్వారా సీనియర్ నీట్, జేఈఈ ఫ్యాకల్టీ ని ఏర్పాటు చేసి ఉత్తమ శిక్షణను అందజేస్తున్నారు కనుక విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కళాశాల డైరెక్టర్ ఎస్. వి. వాసుదేవ రెడ్డి మాట్లాడతూ ప్రతి సంవత్సరం అత్యుత్తమ జాతీయ స్థాయి ర్యాంకులను సాధించడం న్యూక్లియస్ కు సంప్రదాయం గా మారిందని, భవిష్యత్తు లో న్యూక్లియస్ మరింత ఎక్కువ మంది ఐఐటియన్లను నంద్యాల నుండి తయారు చేస్తుందని తెలిపారు. కళాశాల సలహాదారులు ఎమ్. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు దూరప్రాతాలలో ఉన్న విద్యాసంస్థలలో అధిక ఫీజులు చెల్లించి చేరుతున్నారని, మన ప్రాంతంలో మిగిలిన కొద్దిమంది విద్యార్థులతోనే ఆశ్చర్య పోయే అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నామని , తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జే ఈ ఈ అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అద్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వెలుగోడు లో పల్లెవనం కార్యక్రమం.



వెలుగోడు ఫిబ్రవరి 12 న్యూస్ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పల్లె వనం కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు వెలుగోడు పట్టణ ఐదవ సచివాలయ ప్రాంగణంలో జనసేన నాయకులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో అటవీ అధికారులతో పాటు తెలుగుదేశం జనసేన నాయకులు ధూపం అభిమన్యుడు, డాక్టర్ జాకీర్ హుస్సేన్ అమీర్ హంజా, షాలుబాషా, చిన్న వలి తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు సత్వర న్యాయం అందించాలి



కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి12 (రిపబ్లిక్ న్యూస్) జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశానుసారం, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కర్నూలు, ఉమ్మడి కర్నూల్ జిల్లా ప్రజలకు తెలియజేయడం ఏమనగా ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో 8వ తేదీ మార్చి, 2025న రెండవ శనివారము నాడు కర్నూలు మరియు నంద్యాల జిల్లాలలోని అన్ని న్యాయ స్థానాల్లో పెండింగ్ లో ఉన్న రాజీ పడదగిన సివిల్, మోటార్ ఆక్సిడెంట్ కేసులు, క్రిమినల్ మరియు ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలియజేశారు. ఈ అవకాశమును కక్షిదారులు అందరూ ఉపయోగించుకోవాలని, తమ తమ కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు. ఇందులో భాగంగా కార్యదర్శి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కర్నూలు వారు అన్ని మండల న్యాయ సేవధికర సంస్థల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీలైనన్ని పెండింగ్లో ఉన్న రాజీ కాబడిన కేసులను పరిష్కరించడంలో శ్రద్ధ చూపించాలని కోరారు.

## పందిపాడు,ఇందిరమ్మ కాలనీ ప్రజలకు

# నీళ్లు అందించండి మహాప్రభో

**కర్నూలు మున్సిపల్ కమిషనర్ కి విజ్ఞప్తి**




కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్) కర్నూలు నగరం,కల్లూరు మండలంలో నీ శ్రీ గోడల వీరాంజనేయ స్వామి గుడి దగ్గర గత 15సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నారు.అయితే కాలనీ ఏర్పడి నుంచి కనీస మౌలిక సదుపాయాలు లేక కాలనీవాసులు ఎంతో తీవ్రఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వాలు ఎన్నో మారినకానీ కాలనీ అభివృద్ధికి మాత్రం నోచుకోలేదు.వర్షాకాలం వచ్చిందంటే నడవడానికి ఎంతో ఇబ్బంది పడుతూ బయటకు వెళ్లలేక పనులు చేసుకోలేక చాలా ఇబ్బందిగా ఉంటుంది. కాలనీవాసులు పనిచేస్తే తప్ప ఇంట్లో పూట కూడా గడవదు.గత ప్రభుత్వంలో నీళ్ళకి ఆరు మోటర్లు తవ్వించగా, ప్రస్తుతం మూడు మాత్రమే పనిచేస్తున్నాయని దీంతో ప్రజలలు నీటి సమస్య ప్రధానంగా ఏర్పడిందని కాలనీ అభివృద్ధి కమిటీ బృందంరాము, అన్వర్ భాష,శేఖర్, నాగరాజు, మౌలాలి, కాలనీవాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాబోయేది ఎండాకాలం కనగా ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు.కావున నగర పాలక సంస్థ కమిషనర్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.రిపేరిలో ఉన్న మోటార్లను మరమ్మత్తులు చేయాలనీ, అంతవరకు కనీసం మంచినీళ్ల ట్యాంకర్ లను సరఫరా చేయాలనీ వారు కోరారు.

# 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, ఆర్టీసీ కళాశాలలో డ్రైవర్లకు అవగాహన సదస్సు



కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్) కర్నూల్ నగరంలోని ఏపీఎస్ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 27వ రోజు కొనసాగుతున్నాయి. కార్యక్రమం డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎస్ శాంత కుమారి ఆదేశాల మేరకు ఆర్టీవో ఎల్ భరత్ చావన్ పర్యవేక్షణలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ కే రవీంద్ర కుమార్, ఎన్ నాగరాజా నాయక్, ఎంవి సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బాబు కిషోర్ ఆధ్వర్యంలో ఈ సదస్సు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీఎస్ఆర్టిసి కడప జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్ఆర్టీసీ కర్నూల్ డిపిటిఓ శ్రీనివాసులు, ఆర్టీసీ డిపో 1 మేనేజర్ సుధామణి, ఏపీఎస్ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ నజీర్ అహ్మద్, ట్రాఫిక్ సిఐ ఎస్ మన్సూరుద్దీన్, లు హాజరయ్యారు. ఆర్టీవో ఎల్ భరత్ చావన్ మాట్లాడుతూ జనవరి 16 నుండి ఫిబ్రవరి 15 వరకు జరగబోయే రోడ్డు భద్రత మాసోత్సవాలో భాగంగా రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు సూచనలు తెలియజేశారు. ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించి వాహనాలను నడిపి గమ్యం చేరాలని ఆయన డ్రైవర్లను కోరారు. కర్నూల్ ట్రాఫిక్ సిఐ మనసురుద్దీన్ మాట్లాడుతూ, డ్రైవర్లు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించి వాహనాలను నడపాలన్నారు, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం రాష్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమని ఆయన తెలిపారు ముఖ్యంగా డ్రైవర్లు సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం ఎంతో ప్రమాదకరమనీ అన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు సంఘటన స్థలంలో ఉన్న ఎవరైనా సరే సహాయకుడు బాధ్యతగా అంబులెన్స్ పిలిపించి హాస్పిటల్కు తరలించాలన్నారు. రహదారి పైన ప్రమాదం జరిగినప్పుడు ప్రమాద బాధితులను రక్షించడంలో మొదటి 60 నిమిషాలు ప్రమాద తీవ్రతను తగ్గించడానికి మరియు మరణాలు తగ్గించడానికి చాలా కీలకమైనవి ప్రాణాంతక రహదారి ప్రమాదాలలో క్షతగాత్రులను గోల్డెన్ అవర్ సమయంలో ఆస్పత్రి లేదా ట్రామా కేర్ సెంటర్ లకు తరలించి తగిన చికిత్సను అందించలనారు, ఈ సందర్భంగా కడప జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఈరోజు కర్నూలు జిల్లాలో ఉన్న ఆర్టీసీ జోనల్ ట్రైనింగ్ కళాశాల లో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది, కర్నూల్ ఆర్టీవో, ట్రాఫిక్ సిఐ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, అధికారులు అందరూ పాల్గొని ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రత మీద ఉత్తేజం కలిగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు వాడకం దారులందరూ ఎలాంటి చర్యలు తీసుకోవాలి దేనికి





నియంత్రణ యంత్రాంగం ఎలాంటి కార్యక్రమాలు చేపడుతుందో ఇవన్నీ కూడా ఆర్టీవో వివరించడం జరిగింది, ట్రాఫిక్ సిఐ ప్రమాదాలు జరిగినప్పుడు ఏ రకమైన చర్యలు తీసుకోవడం ద్వారా గాయపడిన ప్రాణాలు ఎలా నిలుపుకోవాలని దానిపైన చాలా వివర్నాత్మక సందేశం ఇచ్చారు. ఆర్టీసీ పరంగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నాము అవన్నీ కూడా మేము ఆర్టీసీ అధికారులము వివరించడం జరిగింది, గతంలో మేం కూడా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించే వాళ్ళం పక్షోత్సవాలు నిర్వహించే వాళ్ళం ఇప్పుడు ఒక నెలపాటు మాసోత్సవాలు నిర్వహించుకుంటున్నాం ఈ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మా డ్రైవర్ల అందరికి కూడా ఈ రోడ్డు సేఫ్టీ డ్రైవింగ్ అలవెన్స్ అనేది ఇవ్వడం జరుగుతుంది, ఒక సంవత్సరం పాటు ఎలాంటి ప్రమాదం చేయకుండా విధి నిర్వహణ లో రెండు, సంవత్సరం మూడో సంవత్సరం ప్రమాదరహిత రికార్డు నిర్వహిస్తే ఆ విధంగా వారికి అలవెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆరోగ్య పరీక్షలు అన్ని నిర్వహిస్తున్నాం 45 సంవత్సరాల లోపు ఉన్న డ్రైవర్లకు మూడు సంవత్సరాలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు 45 సంవత్సరాలు దాటిన వారికి ప్రతి సంవత్సరం ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇలాంటి పెండెన్సీ లేకుండా ఈ మాసోత్సవాల సందర్భంగా చూసుకుంటామని అన్నారు. ఈరోజు ఆర్టీసీ బస్సు స్టీరింగ్ పట్టుకున్న ప్రతి వ్యక్తి ఆరోగ్య భద్రత పరీక్షలు చేయబడి ఆరోగ్యవంతుడే ఉన్న డ్రైవరే ఆర్టీసీ స్టీరింగ్ మీద ఉన్నాడని ఆయన తెలిపారు. కాబట్టి ప్రజలందరూ కూడా ఆర్టీసీ డ్రైవర్ల చేతిలో సురక్షితమైన ప్రయాణం చేసుకోవచ్చని అన్నారు. మా వంతు కర్తవ్యం మా సిబ్బందిలో ఆరోగ్యకరమైన వాళ్లు రక్త దాన శిబిరాలు నిర్వహించి రక్తదానం చేస్తున్నారు. ఆ విధంగా ఇప్పటికే రెండు రోజులుగా రక్తదాన శిబిరాల్లో కార్పొరేషన్ పరంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడు వేల యూనిట్లకు పైగా రక్తదానం చేశారు. ఈరోజు రేపు కూడా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నాము, దాదాపుగా మేము 48 వేల సిబ్బంది ఉంటే కనీసం 5,000 యూనిట్లకు పైగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆ విధంగా 5000 మంది ప్రాణాలను కాపాడిన వాళ్ళమవుతామన్నారు. బస్సులకు సంబంధించి ప్రమాదానికి కారణమయ్యే అంశాలకు ప్రత్యేకంగా శ్రద్ధ వహించి, నిర్వహణ చేస్తున్నాము. ఈ మాసోత్సవాల సందర్భంగా ఆ కార్యక్రమాలన్నింటినీ నిర్వహించబోతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ డిపో 2 మేనేజర్ సర్దార్ హుస్సేన్, ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ నజీర్ అహ్మద్, ఏపీఎస్ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు, ట్రాన్స్పోర్ట్ కానిస్టేబుళ్లు విజయ భాస్కర్, చలపతి, హోంగార్డులు, ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్లు, ఆర్టీసీ కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహాయం తో నిర్మించిన షాపులను సీజ్ చేయడం సరికాదు.

### : ఆలయ కమిటీ చైర్మన్



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్)**
కల్లూరు చౌడేశ్వరీ దేవి ఆలయానికి సంబందించిన 14 షాపులను దేవాదాయశాఖ అధికారులు సీజ్ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయశాఖ అధికారులు గత సంవత్సరంలో దాతల సహాయంలో 14 షాపులను నిర్మించారు. షాపుల నిర్మాణానికి ఒక్కో దాత మూడు లక్షల రూపాయలు ఖర్చు చేశారని ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. షాపులను 11 సంవత్సరాల పాటు బాడుగ చెల్లించి దాతలే నిర్వహించుకొనే విధంగా అగ్రిమెంట్ వ్రాసుకున్నామని చైర్మన్ తెలిపారు. ఈవిషయం దేవాలయ ఈఓ గుర్రెడ్డి దృష్టికి తీసుకుని పోయామని వారు పత్రాలు చూపించారు. ఈరోజు ఉదయం ఈఓ 14 షాపులను సీజ్ చేయడంతో దాతలు కోర్టు ను ఆశ్రయించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షాపులను సీజ్ చేశామని ఈనెల 14న బహిరంగ వేలం వేస్తామని గుర్రెడ్డి తెలిపారు.

## ఈనెల 23న ఎస్టీబీసీ కళాశాల మైదానంలో మాలల యుద్ధగర్జనను విజయవంతం చేయండి.



కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేశారని మాలమహాసభ నాయకులు కర్నూలులో అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కర్నూలులో ఈనెల 23న మాలల యుద్ధ గర్జన నిర్వహిస్తున్నామని మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు తెలిపారు. ఈకార్యక్రమానికి సంబంధించిన గోడపత్రులను మలల జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి మాలలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. యుద్ధ గర్జన కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యాలను ఆయన మీడియాకు వివరించారు. ఎస్సీ వర్గీకరణ వల్ల రిజర్వేషన్ల ఫలాలను ఎస్సీ ఎస్టీ లు అందరూ సమానంగా తీసుకోలేరన్నారు. ఈవిషయంలో సుప్రీంకోర్టు తీర్పు ను మాలల జేఏసీ నాయకులు తప్పు పట్టారు. గత వైసీపీ హాయంలో సచివాలయ సిబ్బంది మాలల జనాభాను తగ్గించి చూపారని వెంకట్రావు తెలిపారు.మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు. మల్లెల వెంకట్రావు తో పాటు మాలల జేఏసీ నేతలు యాట ఓబులేసు, మాదవస్వామి, గోన నాగరాజు, వేల్పుల జ్యోతి, బంగి సుధీర్, కుందా వెంకటేశ్వర్లు, వడ్డేపల్లి మాదవస్వామి, కేధర్ తదితరులు పాల్గొన్నారు.

## క్లస్టర్ యూనివర్సిటీ మొదటి సెమిస్టర్ డిగ్రీ ఫలితాలు విడుదల



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 12 రిపబ్లిక్ న్యూస్**
క్లస్టర్ యూనివర్సిటీ మొదటి సెమిస్టర్ డిగ్రీ ఫలితాలు విడుదల చేసిన వీసీ
క్లస్టర్ యూనివర్సిటీ మొదటి సెమిస్టర్ డిగ్రీ ఫలితాలు వైస్ ఛాన్సర్ ఆచార్య డివిఆర్ సాయి గోపాల్ బుధవారం విడుదల చేశారు. ఈ పరీక్షలు డిసెంబర్ నిర్వహించామని, మొత్తం 872 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 415మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని క్లస్టర్ యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కే నాగరాజ్ శెట్టి తెలిపారు. 48% శాతం మంది యూనివర్సిటీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. రివాల్యుయేషన కు అప్లై చేసుకునే విద్యార్థులు ఫిబ్రవరి 21 తేదీ లోపల చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కే బాలసుబ్రమణ్యం, డాక్టర్. ఏ విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ రమణయ్య పాల్గొన్నారు .

## అమరావతిని ఫ్రీ జోన్ గా ప్రకటించాలి

### డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి : ఏఐవైఎఫ్




కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్): అమరావతిని ఫ్రీజ్ జోన్ గా ప్రకటించి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల వారికి అవకాశం కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు డిమాండ్ చేశారు.
బుధవారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 6 నుండి 9 వరకు శ్రీకాకుళంలో 22 వ రాష్ట్ర మహాసభలు విజయవంతంగా నిర్వహించుకోవడం జరిగిందని ఈ మహాసభల్లో రాష్ట్రవ్యాప్తంగా యువకులు ఎదుర్కొంటున్న సమస్యల పైన చర్చించి అనేక తీర్మానాలు చేయడం జరిగిందని ఆయన వివరించారు 2014 రాష్ట్రం విడిపోయినప్పటి నుంచి మూడుసార్లు సాధారణ ఎన్నికలు జరిగినప్పటికీ 2018లో మినహాయిస్తే ఇప్పటివరకు డిఎస్సి నోటిఫికేషన్ ఇవ్వకపోవడం రాష్ట్ర పాలకులకు విద్య పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని ఆయన విమర్శించారు 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు తాను అధికారంలోకి వస్తే మొదటి సంతకం మెగా డీఎస్సీ పైనే పెడతానని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత సంతకానికే పరిమితమయ్యాడు తప్ప డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు వెంటనే డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కర్నూలు జిల్లా ఓర్వకల్లు లోని పారిశ్రామిక హబ్ లో ఏర్పాటు చేసే పరిశ్రమల్లో స్థానిక యువత కే 75% ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని జీవో తీసుకురావాలని , రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 60 వేల మంది వాలంటరీలను కొనసాగించి వారికి గౌరవ వేతనం పదివేల రూపాయలు ఇవ్వాలని, విభజన హామీల్లో భాగంగా వెనకబడిన రాయలసీమ జిల్లాల్లో కడపలో ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని, కర్నూలు జిల్లాలో వలసల నివారణ కోసం శాశ్వత పరిష్కారం కావాలంటే పెండింగ్ సాగునీటి ప్రాజెక్ట్ లైన వేదవతి, గుండ్రేవులను పూర్తిచేయాలని , రాష్ట్రవ్యాప్తంగా కల్తీ ఆహారం వల్ల ప్రజలు క్యాన్సర్ బారిన పడతా ఉన్నారని ఆహార కల్తీని నివారించి ప్రజల ఆరోగ్యాలను కాపాడే విధంగా కల్తీ నివారణ కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని , రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న డ్రగ్స్ కల్చర్ను అరికట్టి విద్యార్థుల్లో యువతలో డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించి డ్రగ్ సప్లై చేసే వారిని కఠినంగా శిక్షించి డ్రగ్స్ రహిత రాష్ట్రముగా తీర్చిదిద్దాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఆన్ లైన్ లో అందరికీ తెలిసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రతి సంవత్సరం ఏపీపీఎస్సీ క్యాలెండర్ విడుదల చేసి యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం భవిష్యత్తు లో సమరశీల పోరాటాలకు కొనసాగించాలని రాష్ట్ర మహాసభలో తీర్మానం చేయడం జరిగిందని పై డిమాండ్లను సాధన కోసం ఏఐవైఎఫ్ గా రాష్ట్రవ్యాప్తంగా యువతలో చైతన్యం కలిగించి పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలియజేశారు ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి షాపిర్ భాషా ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, బిసన్న, నగర ఆఫీస్ బేరర్స్ చంటి, రవి, శ్రీకాంత్, శివాజీ, శ్రీను, మధు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## మహానందిలో పోటాపోటీగా టెండర్లు

### - మహానందీశ్వరుడికి రూ. 1.32 కోట్లు ఆదాయం.


మహానంది, ఫిబ్రవరి 12, (రిపబ్లిక్ న్యూస్): మహానందిలో బుధవారం నిర్వహించిన వివిధ విభాగాల వేలాలు పోటాపోటీగా జరిగాయి. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ ఎరమల మధు ఆధ్వర్యంలో స్థానిక పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో వివిధ విభాగాలకు బహిరంగ, సీల్డ్ టెండర్లు నిర్వహించారు. అందులో భాగంగా ప్రధానమైన టోల్గేట్ విభాగానికి ఒక్కరే సీల్డ్ టెండర్ దాఖలు చేయడంతో వాయిదా వేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా గత ఏడాది టోల్ గేట్ నిర్వహణ ద్వారా 1.71 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మరింత అధిక ఆదాయం సమకూరుతుందని అందరూ భావించారు.

**టెండర్ల ద్వారా మహానందీశ్వరుడికి రూ. 1.32 కోట్లు ఆదాయం**

మహానందిలో జరిగిన అభిషేక సామాగ్రి, పూల దుకాణం, క్లోక్రూమ్ నిర్వహణ, నవగ్రహాల వద్ద దీపారాధన సామాగ్రి విక్రయం, తల నీలాల సేకరణ



విభాగాల ద్వారా మహానందీశ్వరుడికి రూ.1,32,76,100 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అభిషేక సామాగ్రి, పూల దుకాణం విభాగానికి మహానందికి చెందిన పాశం మురళీకృష్ణ రూ.60, 00, 100 తో అధిక హెచ్చు దారుడుగా నిలవడంతో నిర్వహణ బాధ్యతలను దక్కించుకున్నాడు. నవగ్రహాల వద్ద దీపారాధన సామాగ్రి విక్రయానికి మహానందికి చెందిన టి. నాగరాజు రూ.43 లక్షలు, క్లాక్ రూమ్ నిర్వహణ టెండర్ కు శ్రీనగరం గ్రామానికి చెందిన



నాగేంద్ర రూ.21.96 లక్షలు, తల నీలాల సేకరణకు హిందూపురం పట్టణానికి చెందిన రాజా రూ.7.80 లక్షలతో నిర్వహణ హక్కులను దక్కించుకున్నట్లు చెప్పారు. మిగిలిన అంశాలకు వాయిదా పడ్డాయి. మార్చి 4న తదుపరి టెండర్లు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, ఆలయ సిబ్బంది నాగమల్లయ్య, నీలకంఠరాజు, సుబ్బారెడ్డి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలి

## సి.ఐ.టి.యు. డిమాండ్




కర్నూల్లో ప్రతినిధి ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్) ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. అంజిబాబుడిమాండ్ చేశారు సిఐటియు నిర్వహించు విడతల వారి ఆందోళనలో భాగంగా 14వ తేదీన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం దగ్గర (భాగ్యనగర్) ఆందోళన చేపడుతున్నట్లు ఆయన తెలియజేశారు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్. రాధాకృష్ణ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్ నందు జరిగిన సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఇతర మూడు బ్యాంకులను కలిపి ఆర్బిఐ ఒకే బ్యాంకు గా మార్చడం జరిగిందని అయితే ప్రధాన కార్యాలయం అమరావతికి తరలించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని అది సరైనది కాదని ఆయన అన్నారు ఆర్.బి.ఐ సూచించిన సూచనల ప్రకారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండడానికి అన్ని రకాల అర్హతలు ఉన్నాయని ఆయన అన్నారు మిగిలిన బ్యాంకుల మొత్తం రిజర్వుల కంటే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు రిజర్వులు 1400 కోట్లు ఎక్కువగా ఉందని తెలిపారు అన్ని బ్యాంకుల మొత్తం కస్టమర్ల కంటే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కస్టమర్లు ఎక్కువమంది ఉన్నారని అలాగే బ్రాంచీల సంఖ్య కూడా ఎక్కువగానే ఉందని తెలిపారు కడపలో సొంత భవనమే ఉండడం కాకుండా అన్ని జిల్లాలలోనూ సొంత భోనాలు ఉన్నాయని ఏటీఎంలు కూడా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు కావున ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండాలని డిమాండ్ చేశారు దీనికోసం సిఐటియు విడతల వారి ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు ఆయన తెలియజేశారు ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న సాయిబాబా జిల్లా కార్యదర్శులు విజయ్, ప్రభాకర్, జే.నాగేశ్వరరావు, నారాయణస్వామి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు

## ఆలోచించి నిర్ణయాలు తీసికోవాలి,మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

### : డాక్టర్ సింధూజ



పాణ్యం ఫిబ్రవరి. 12,రిపబ్లిక్ న్యూస్, పాణ్యం మండలం లోని శాంతిరాం వైద్య విభాగం నందు. మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని శాంతిరాం హాస్పిటల్ మానసిక వైద్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సింధుజ ఓంకారం పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో భావోద్వేగా బుద్ధి మీ కలలను నిజం చేసుకోవడం అనే అంశంపై విద్యార్థినీలకు మహిళా అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినీలు భావోద్వేగాలను నియంత్రించడం ద్వారా మానసిక అభివృద్ధి చెందుతారు అన్నారు. మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. మంచి నిర్ణయాలు ఆలోచించి తీసుకోవాలన్నారు. తొందరపడి మానసికంగా కుంగిపోరాదన్నారు. మానసిక ధైర్యం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూఏ మహిళా సాధికారత సెల్ డైరెక్టర్ డాక్టర్ చైత్ర, కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ హరిత, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



# కిక్ బాక్సింగ్ లో జిల్లాకు పతకాలు

**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్)**
కర్నూల్ స్పోర్ట్స్ .ఈనెల 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు ఢిల్లీ వేదికగా జరిగిన నాల్గవ అంతర్జాతీయ వాకో ఇండియా కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ కిక్ బాక్సింగ్ పోటీలు జాదవ్ ఇండోర్ స్టేడియం ఇంద్ర గాంధీ కాంప్లెక్స్ న్యూ ఢిల్లీలో జరిగాయి ఇందులో మొత్తం 20 దేశాలు పాల్గొన్నాయి అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి మొత్తం28మంది క్రీడాకారులు పోటీలో పాల్గొన్నరు అందులో 24 మంది క్రీడాకారులకు పథకాలు రావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుంచి క్రీడాకారులు 3 బంగారు 9 వెండి పథకాలు 12 కాంస్య పథకాలు రావడం జరిగింది అందులో మన కర్నూలు జిల్లాకు చెందిన త్రినాథ్ కిక్ బాక్సింగ్ అకాడమీ క్రీడాకారులు సీనియర్ విభాగంలో గుర్రం జయ కళ్యాణ్ పాయింట్ ఫైవ్ ఈవెంట్లో 69కేజీ వెయిట్ విభాగంలో వెండి మెడల్ మరియు గుర్రం హరి కళ్యాణ్ రింగ్ ఫైట్ లా కిక్ 75కేజీ విభాగంలో వెండి మెడల్ మరియు ఉప్పరి ఉపేంద్ర పాయింట్ ఫైటు 63 కేజీ విభాగంలో కాంస్య మెడల్ మరియు జూనియర్ కేటగిరి విభాగంలో బొడ్డు బోయిన ఈశ్వర్ పాయింట్ ఫైవ్ 63 కేజీ విభాగంలో వెండి మెడల్ కిట్ లైట్ విభాగంలో 63 కేజీ విభాగంలో వెండి మెడల్ సాధించారు . వీరిని కర్నూలు జిల్లాకు పథకాలు సాధించిన అందరిని మరియు కోచ్ నరేంద్రను జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాష వీరిని అభినందించారు మరిన్ని అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించి కర్నూలు జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని క్రీడాకారులను సర్టిఫికేట్ మెడలు ఇచ్చి అభినందించారు.

# చిన్మయ మిషన్ పాఠశాలకు భవనాశి ట్రస్ట్ టీవీ బహుకరణ




చిన్నయ్య మిషన్ స్కూలుకు టీవీ అందజేస్తున్న ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు భవనాశి నాగ మహేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ తదితరులు.

**నంద్యాల ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో,స్థానిక చిన్మయ మిషన్ పాఠశాలకు,భవనాశి వెంకటసుబ్బయ్య శెట్టి,శ్రీమతి వెంకమ్మ ట్రస్ట్ తరపున,లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్,ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు భవనాశి నాగ మహేష్ తమ తండ్రి భవనాశి శ్రీరామమూర్తి జ్ఞాపకార్థం విద్యార్థులకు విద్యా బోధనలో ఉపయోగించడానికి పదివేల రూపాయల టెలివిజన్ బహూకరించారు.ఈ సందర్భంగా భవనాశి నాగ మహేష్ మాట్లాడుతూ తమ తండ్రి దివంగత భవనాశి శ్రీరామ్మూర్తి లయన్స్ క్లబ్ ద్వారా విశేష సేవలు అందించారని, వారి స్ఫూర్తితోనే తాము కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్,జిల్లా చైర్మన్ భవనాశి నాగ మహేష్, కోశాధికారి మామిళ్ల నాగరాజు,చిన్మయ మిషన్ స్కూల్ అధ్యక్షులు ఆంజనేయులు గుప్తా, కార్యదర్శి కశెట్టి కృష్ణమూర్తి, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు బవిరిశెట్టి శ్రీకాంత్ ఉపాధ్యక్షులు కూరా ప్రసాద్, సంయుక్త కార్యదర్శి సందీప్,సభ్యులు మేడా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, విద్యార్థులపై ఈవ్ టీజింగ్ పై ప్రత్యేక దృష్టి

### ఆర్ జి యమ్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ చాంద్ బాషా.

**పాణ్యం ఫిబ్రవరి,12,ప్రజా రిపబ్లిక్ న్యూస్.**



పాణ్యం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అది రాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్ అనే ప్రత్యేక కార్యక్రమం జిల్లా అంతటా చేపట్టడం జరిగింది. పాణ్యం మండలం ఆర్ జి యం ఇంజనీరింగ్ కాలేజీ నెరవాడ మెట్ట సముదాయంలో విద్యార్థులతో,మహిళలతో గ్రామ పెద్దలతో మాట్లాడటం జరిగింది. ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు ఎక్కువై నందువలన స్త్రీలు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ చాంద్ భాషా కోరారు. బెట్టింగ్లు, జూదాల వైపు, యువకులు ఆకర్షితులు కారాదని ఆయన తెలిపారు. చిన్న చిన్న సమస్యలకే సూసైడ్ చేసుకుంటున్న యువత వారి తల్లిదండ్రులకు క్షోభ పెట్టరాదు అని అన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించటం నేరము, గంజాయి అమ్మే వారి యొక్క వివరాలు పోలీసు వారికి తెలుపగలరు సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడును,ఈవ్ టీజింగ్ మరియు బాలికలపై స్త్రీలపై ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే 100 కి ఫోన్ చేసి చెప్పాలని కోరారు

# నంద్యాల సబ్ డివిజన్ కు సంబంధించి నేర సమీక్షా సమావేశం నిర్వహణ

### జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా





నంద్యాల క్రైం, ఫిబ్రవరి 12, (రిపబ్లిక్ న్యూస్): పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నంద్యాల సబ్ డివిజన్ కు సంబంధించి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేర నియంత్రణ కొరకు తీసుకోవలసిన చర్యలపై ప్రాధాన్యత క్రమంలో వివరించడం జరిగింది. ఈ సమావేశం నందు పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు వాటి వివరాలు, పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రేవ్ కేసులు వీగిపోకుండా ముద్దాయిలకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి.

బాధితులకు న్యాయం జరగాలంటే, నేరం జరిగాక ఘటనా స్థల పరిశీలన, సాక్ష్యాధారాలు సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, ఛార్జిషీటు దాఖలు, కోర్టు ట్రయిల్స్ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకుని ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా వ్యవహరించాలి పూర్తిస్థాయిలో విచారణ దర్యాప్తు చేసి ఖచ్చితమైన ఆధారాలతో కోర్టుకు సమర్పించి బాధితులకు సరైన న్యాయం చేయాలన్నారు. యు ఐ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి నిర్ణీత సమయం లోపల చార్జిషీట్ దాఖలు చేసి కేసులు తగ్గించాలి. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని, తప్పిపోయిన బాలురు/బాలికలు యొక్క విషయాలలో త్వరితగతిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారి యొక్క ఆచూకీ తెలుసుకొని వారి యొక్క తల్లిదండ్రులకు అప్పగించాలి.

స్కూల్ ,కళాశాలలు,హాస్టల్ లలో విధ్యార్తులకు ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలపై అవగాహన కల్పించాలి. పోక్సో కేసులలో నిందితుయాలపై నిఘా ఉంచాలి. అవసరమైతే రౌడీ షీట్ ఓపెన్ చేసేలా చర్యలు తీసుకోవాలి. రహదారి ప్రమాదాల నివారణ కొరకు తీసుకోవలసిన చర్యలు అనగా హెచ్చరిక బోర్డ్ లు,క్యాట్ ఐస్,రోడ్డు బోర్డర్ లైన్స మొదలగు వాటిని ఏర్పాటు చేస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వీటికి అధికారులు ఆదిక ప్రాధాన్యత ఇవ్వాలని దిశ నిర్దేశం చేశారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి. విజిబుల్ పోలీసింగ్ పెంచాలి. బీట్స్ రీ ఆర్గనైజ్ చేసి పట్టణ మారుమూల ప్రాంతాలకు బీట్స్ తిరిగేలా చర్యలు తీసుకోవాలి. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెంచండి. రౌడీ షీటర్ లు సత్ప్రవర్తనతో మెలగాలని అవగహన కార్యక్రమము నిర్వహించాలి. పి.జి.ఆర్.ఎస్ పిటీషన్ లపై ప్రత్యక దృష్టి ఉంచి నిర్ధేశిత గడువులోగా చర్యలు తీసుకోవాలి.చర్యలు తీసుకున్నవి జిల్లా కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. ఎన్ఫోర్సెమెంట్ పై ప్రత్యక దృష్టి ఉంచాలని, ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి,మద్యం పి.డి.ఎస్.రైస్ అక్రమ రవాణా జరగకుండా నిరోధించాలని, నాటు సారాయిని పూర్తిగా నివారించాలలి, భాహిరంగ మద్యపానం,డ్రంక్ అండ్ డ్రైవ్ ,మైనర్ డ్రైవింగ్ పై చర్యలు తీసుకోవాలి.నంబర్ ప్లేట్ లేని వాహనాలపై నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకోవాలి. నంద్యాల సబ్ డివిజన్ కు సంబంధించి నేరాలు జరిగే ప్రవేశాలను గుర్తించి సదరు ప్రదేశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తద్వారా నేర నియంతరణ జరుగుతుందని, నేర నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు. ఈ కార్యాక్రమంలో నంద్యాల ఎస్.డి.పి.ఓ మంద.జావళి ఆల్ఫోన్స్ అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు పాల్గొన్నారు.

# బీసీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పి మురళీకృష్ణ



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి12 (రిపబ్లిక్ న్యూస్)**
ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కోడుమూరు మాజీ ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మాజీ సభ్యులు, పి మురళి కృష్ణ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో డిసిసి అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గెలిచి ఆరు నెలలు గడిచిన 143 బీసీ కులాలు ఉన్నాయని ఏ ఒక్క కులానికి న్యాయం జరగలేదని బీసీలకు అన్యాయమే జరిగిందని కూటమి ప్రభుత్వం గెలిచాక బీసీ డిక్లరేషన్ ఇచ్చిన హామీలు ఏవి అమలు చేయలేదని కూటమి ప్రభుత్వం దివ్యాంగులను, వృద్ధులను, పెన్షన్ల రీవెరిఫికేషన్ పేరుతో ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ ఉదయం, సాయంత్రం తిప్పుతున్నారని గత 20, 30 సంవత్సరాలుగా ఉన్న పెన్షన్లను రివెరిఫికేషన్ పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని గత టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన పెన్షన్లను రీ వెరిఫికేషన్ చేయడం ఏంటని ప్రశ్నించారు. గతంలో డాక్టర్లు పరీక్షలు చేసే సర్టిఫికెట్ ఇచ్చి ఉంటారని మరి వారిని ప్రభుత్వ ఆసుపత్రికి పిలిచి ఇబ్బందులకు గురి చేయవద్దని చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. బీసీలకు 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నెలకు 4000 రూపాయలు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని, బీసీల కోసం ప్రత్యేక చట్టం బీసీ కార్పొరేషన్ ద్వారా ఐదు సంవత్సరాలలో లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారని బీసీలకు రాజకీయ ప్రాధాన్యత నామినేట్ పదవులలో 34 శాతం రిజర్వేషన్ అన్నారని చట్టసభలకు బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. తక్కువ జనాభాతో ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు నామినేషన్ల ద్వారా రాజకీయ భాగస్వామ్యం కల్పిస్తామని బీసీల ఆర్థిక అభివృద్ధి ఉపాధి ప్రోత్సాహకాలు పునరుద్ధరిస్తామని దామాషా పద్ధతిలో కార్పొరేషన్లకు నిధులు కేటాయించి స్వయం ఉపాధికి ఐదేళ్లలో పదివేల కోట్ల రూపాయలు వ్యయం చేస్తామన్నారు. 5000 కోట్లతో ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని యాదవులకు, కురుబలకు అత్యాధునిక ప్రమాణాలతో గొర్రెల పెంపకం యూనిట్ల స్థాపనకు రాయితీలు, గొర్రెలు, మేకల పెంపకం యూనిట్లకు చేయూత ఇస్తామన్నారు. చేనేత ఉత్పత్తులపై రియంబర్స్ చేస్తామని, పవర్లూమ్ లకు 500 యూనిట్లకు, హ్యాండ్ లూమ్ లకు 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ దేవాలయాలలో పనిచేసే నాయి బ్రాహ్మణులకు 25 వేల వేతనం, షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అన్నారని అవి ఎక్కడ అమలు కావడం లేదని మోసపూరిత వాగ్దానాలు చేసినట్లయితే పెద్ద ఎత్తున కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రజల పక్షాన నిలబడి నిరసన చేస్తామని, ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఆరు నెలలు గడిచిందని ఈ ఆరు నెలలు ఏమి చేయలేదని రాబోయే రోజుల్లో బీసీలకు అన్యాయం చేయకుండా న్యాయం చేయాలని మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు మాట్లాడుతూ బీసీలకు ఎన్నో పథకాలు ఇస్తామని ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు, నారా లోకేష్ గారు పవన్ కళ్యాణ్ గారు ఎన్నికల ముందు మా ప్రభుత్వం వస్తే సంవత్సరానికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఫిబ్రవరి వచ్చిందని కానీ విడుదల చేయలేదని బీసీ మహిళలకు 3 లక్షల నుండి పది లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారని అవి అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణం అన్నారు ఇంతవరకు అమలు చేయలేదని హామీలు తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆంధ్రప్రదేశ్లో బీసీ కులాలు 45 శాతం ఉండారని పక్క రాష్ట్రాలలో 42 నుంచి 45% రిజర్వేషన్లు ఇస్తుంటే మన రాష్ట్రంలో 34 శాతం అమలు చేస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని, అలాగే నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని, అలాగే బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని వారికి ఎలాంటి ఆర్థిక సహాయం చేయడం లేదని వడ్డెర్లకు కానీ రజక కులస్తులకు కానీ ఒక ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదని బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్ప ఇతర ప్రభుత్వాలలో అన్యాయం జరుగుతుందని సాంబశివుడు గారు ప్రశ్నించారు. ఈ

# ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థల క్యూ

**లోకేశ్‌ను కలిసిన ఫార్చ్యూన్ కంపెనీ సిఫీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్**

**పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం**



అమరావతి, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్):ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు క్యూకడుతున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఇప్పటికే పలు కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి సీఎం చంద్రబాబుతో ఒప్పందాలు చేసుకున్నాయి. అలాగే జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీ నుంచి లూలు సంస్థ వెళ్లిపోయింది. ఆ సంస్థ సైతం మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి అంగీకారం తెలిపింది. ఇవేగాకుండా టాటా సంస్థతోపాటు పలు ప్రముఖ ఐటీ కంపెనీలు కూడా ఏపీలో తమ సంస్థలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చాయి. అయితే తాజాగా ఏపీ మంత్రి నారా లోకేష్‌ను ఫార్చ్యూన్ 500 కంపెనీ సిఫీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజు వేగేశ్న బుధవారం కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి లోకేష్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి సిఫీ ఛైర్మెన్ రాజు వేగేశ్న సుముఖత వ్యక్తం చేశారు. విశాఖలో మెగా డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుపై నారా లోకేష్ చర్చించారు. ఏపీలో పెట్టుబడులకు ప్రస్తుత అవకాశాలను మంత్రి లోకేష్ వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై వివరణ ఇచ్చారు. నూతనంగా తీసుకువచ్చిన ఐటీ పాలసీల గురించి లోకేష్ ప్రస్తావించారు. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాకపోవడంతో ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకలేదు. దీంతో యువత చాలా నష్టపోయింది. గత జగన్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో లూలూ సంస్థ కూడా ఏపీ నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయింది. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో.. ఉపాధి కోసం యువత దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గ్రహించారు. అందుకే.. ఈ ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి, పరిశ్రమల ఏర్పాటుకు దేశవిదేశీ సంస్థలు క్యూ కడుతున్నాయి.

# అసత్యాల ప్రచారంలో ఆరితేరిన వైకాపా

**కావాలనే పథకాలపై దుష్ప్రచారం**

**వైసిపి నేతల తీరుపై మండిపడ్డ మంత్రి**




అమరావతి, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్): కూటమి ప్రభుత్వంపై కుట్రతో కొందరు అన్ని కార్యక్రమాల పై దుష్ప్రచారం చేస్తున్నారని వైసీపీపై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కావాలనే ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణం పై లబ్ధిదారులకు అన్యాయం చేసినట్టు ప్రతిపక్ష పార్టీకి చెందిన పత్రికలో అన్ని వక్రీకరణలు చేస్తున్నారని అన్నారు. రిజాయిండర్ ఇచ్చినా.. దాన్ని కూడా వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఘోరంగా హత్యకు గురైన వ్యక్తిని గుండె పోటుతో చనిపోయారని నమ్మించే ఓ పార్టీ పత్రిక నుంచి ఇంత కంటే ఎక్కువ ఊహించలేమని అన్నారు. వైసీపీ నిర్వాకం కారణంగా ప్రధాన మంత్రి అవాస్ యోజన 1.0 కింద లబ్దిదారుల విషయంలో లేనిపోని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ఎంపిక చేసిన 3.18 లక్షల మంది లబ్దిదారుల జాబితాను మార్చేసి వైసీపీ లబ్దిదారుల సంఖ్యను సగానికి తగ్గించేసిందని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. అప్పుడు మిగిలిపోయిన వారికే కేంద్ర ప్రభుత్వం 2024 ఏప్రిల్ తర్వాత ఇళ్లు మంజూరు అయ్యాయని అన్నారు. పేదవాళ్ళ ఇళ్ల నిర్మాణంకి సంబధించిన రూ.3,598 నిధులు కూడా గత ప్రభుత్వం మళ్లించింది.. పీఎంఎవై 1.0ను కేంద్రం 2027 వరకూ పొడిగించిందని మంత్రి తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కింద ప్రస్తుతం లబ్దిదారుల సర్వే జరుగుతోంది.. ఇప్పటి వరకూ 11,600 మంది లబ్దిదారులను గుర్తించామని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్రం 50 వేల ఇళ్లను మంజూరు చేసింది.. ఇంకో 4.5 లక్షల ఇళ్లను కేటాయించేలా ప్రభుత్వ కృషి చేస్తోందని వెల్లడించారు.

# జర్నలిస్టులకు ఇంటి స్థలం.. పక్కా ఇళ్లు ఇవ్వాలి

**- అక్రిడిటేషన్లు తక్షణం మంజూరు చేయాలి - హెల్త్ కార్డు.. ఇన్సూరెన్స్ కల్పించాలి**

**- ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు**







**కర్నూలు, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం, పక్కా ఇళ్లు ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు నగరంలోని ఎస్టీయూ భవన్లో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తరువాత నాటి టీడీపీ ప్రభుత్వం జర్నలిస్టుల పక్కా ఇళ్లు, సంక్షేమం కోసం రూ.100 కోట్లతో ప్రత్యేక నిధి కేటాయించిందని అన్నారు. అమరావతిలో రాష్ట్ర బ్యూరో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఆ తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వం ఐదేళ్లు ఐదేళ్లు పట్టించుకోలేదు... చివర్లో జర్నలిస్టుల ఇళ్ల పథక కింద 60:40 శాతం ఇళ్ల స్థలాలు కొనుగోలు నిధులు ఇస్తామన్నారు.. ఒక్క ఎకరా కొనుగోలు చేయలేదు అన్నారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల సీఎం చంద్రబాబును కలవడం జరిగింది. దీనిపై ఓ కమిటీ వేస్తామని అన్నారు. జర్నలిస్టులకు పింఛన్ స్కీం అమలు చేయాలి, సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలి,ఇంటి స్థలాలు.. పక్కా ఇళ్లు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభల నాటికి ప్రభుత్వం మంజూరు చేయకపోతే ఆందోళన కార్యచరణ తయారు చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్యా అందించాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లామని, సానుకూలంగా స్పందించారని అన్నారు. సంక్షేమ నిధి ఏర్పాటుపై జిల్లా కమిటీ దృష్టి సారించాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా యాజమాన్యం కూడా జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల్లో కొంత మొత్తం జర్నలిస్టుల సంక్షేమానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిపై పోరాటాలకు సిద్ధ పడాలని అన్నారు. జర్నలిస్టులు కూడా కుటుంబం, భార్య పిల్లల సంక్షేమం, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవ సలహాదారులు సుబ్బయ్య, ఐజేయూ అధ్యక్ష, కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, సీనియర్ జర్నలిస్టు హరికిషన్ తదితరులు మాట్లాడారు. అనంతరం రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా రెండవ పర్యాయం ఏకగ్రీవంగా ఎన్నికైన ఐవీ సుబ్బారావును ఘనంగా సత్కరించారు. అలాగే.. రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్నికైన దేవేంద్ర, భీమన్న, మధులను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి అంజి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు శివ, స్వరూప్, నూర్, గిరి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ అధ్యక్షులు శ్రీనివాసులు, పరమేశ్ జయరాజ్, సాలురంగడు తదితరులు పాల్గొన్నారు.

### ఎలక్ట్రానిక్ మీడియా హడహక్ కమిటి కన్వీనర్ గా హరికిషన్

ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ కర్నూలు జిల్లా అడహాక్ కమిటీ కన్వీనర్ గా సీనియర్ జర్నలిస్టు హరికిషన్ ను రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ప్రకటించారు. సభ్యులుగా సీనియర్ జర్నలిస్టులు మధు, సుంకన్న, శివలను ఎన్నుకున్నారు. ఈ కమిటీ జిల్లాలో పర్యటించి ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ కమిటీలు ఏర్పాటు చేయాలని, త్వరలోనే జిల్లా కమిటీ కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.

**దివంగత చిన్నకు ఘన నివాళి:**

ఇటీవల గుడెపోటుకు గురై హఠాన్మరణం చెందిన ఏబీఎన్ స్టాఫ్ కెమెరామెన్ జె. సురేంద్రబాబు (చిన్న)కు ఘనంగా నివాళులు అర్పించారు. చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అందించారు. చిన్న, ఇటివల గుండెపోటుతో మరణించిన విశాలాంధ్ర రిపోర్టర్ హనుమంతన్నల సేవలు కొనియాడారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు నాగరాజు తదితరులు చిన్న కుటుంబం సభ్యులను పరామర్శించారు.

# కోటి దాటిన టిడిపి సభ్యత్వం

**ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**

అమరావతి, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్): కోటి మందికిపైగా తెదేపా సభ్యత్వం తీసుకున్నారని ఆ పార్టీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు అండమాన్ నికోబార్‌లోనూ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతోందన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో కోటి సభ్యత్వాలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రమంత్రులతో చర్చిస్తూ రాష్ట్రాభివృద్ధికి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. 'చిత్తూరు సహా పలు జిల్లాల్లో మిథున్‌రెడ్డి కుటుంబం అక్రమాలు చేసిందని ఫిర్యాదులు వస్తున్నాయి. మంగళగిరి పార్టీ కార్యాలయానికి వందల మంది వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. మీ తప్పులను వేలెత్తి చూపిన పత్రికలపై ఆరోపణలు చేస్తున్నారు'అని ఎంపీ అప్పలనాయుడు ధ్వజమెత్తారు.

-----

### జగన్ హయాంలో ఇళ్ల స్థలాల కేటాయింపులపై విచారణ

**15లోగా అధికారులకు నివేదిక అందించేలా సర్వే**



అమరావతి, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్): గత ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న కూటమి ప్రభుత్వం.. విచారణ తప్పదని హెచ్చరిస్తోన్న విషయం విదితమే.. అయితే, వైసీపీ హయాంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు, హౌసింగ్ నిర్మాణాలకు అనుమతులు పొందిన లబ్దిదారుల్లో అర్హులు, అనర్హులు విషయంలో లెక్కలు తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇళ్ల స్థలాలు, పట్టాలు పొందిన లబ్దిదారులపై పునర్విచారణ జరపాలని నిర్ణయం తీసుకుంది.. దీనికోసం ఈ నెల 10వ తేదీ నుంచి రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్దిదారుల జాబితాలో అనర్హులుంటే వారిని గుర్తించాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి.. ఇక, ఈ సమాచారాన్ని నమోదు చేసేందుకు రెవెన్యూశాఖ ప్రత్యేక మొబైల్ యాప్ ను సిద్ధం చేసింది. ఈ పక్రియ పూర్తయిన వెంటనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప÷-లోడ్ చేయాల్సి ఉంటుంది. పునర్విచారణ పక్రియను ఆయా మండలాల్లో స్థానిక తహశీల్దార్ నేతృత్వంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయరు, వీఆర్వో సభ్యులుగా ఉంటారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి.. ఈ నెల 15వ తేదీలోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలంటూ 26 జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు సీసీఎల్‌ఏ జయలక్ష్మి.. దీంతో, వైసీపీ.. తమ పార్టీ వారికి అక్రమంగా కట్టబెట్టిన వ్యవహారం బయటపడుతుందిన కూటమి నేతలు చెబుతున్నారు..

-------------

### విజయవాడ సితార గ్రౌండ్స్ ఎగ్జిబిషన్‌లో అగ్నిప్రమాదం

**దగ్ధమైన పలు వ్యాపార స్టాళ్లు**




విజయవాడ, ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్): విజయవాడ నగరంలోని సితార గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన జలకన్య ఎగ్జిబిషన్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎగ్జిబిషన్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఎగ్జిబిషన్‌లో వంట సామాగ్రిలో గ్యాస్ బండలు ఉండడంతో.. అవి సైతం పేలాయి. ఈ ప్రమాదంతో ఈ ఎగ్జిబిషన్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బందితోపాటు పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం మంటలను అదుపులోకి తీసుకు వచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. అగ్నిప్రమాదం ఘటనపై విజయవాడ వెస్ట్ డివిజన్ ఏసీపీ ఎన్ఎస్వీకే దుర్గారావుకు ఫోన్ చేసి హో మంత్రి అనిత ఆరా తీశారు. ఈ ప్రమాదంలో ప్రాణ, ఆస్తి నష్టం ఏమైనా జరిగిందా? అంటూ వివరాలు అడిగి ఆమె తెలుసుకున్నారు. గ్యాస్ సిలిండర్ పేలుడు కారణంగానే మంటలు వ్యాపించాయని.. అయితే వాటిని అదుపులోకి తీసుకు వచ్చామని హోం మంత్రి అనితకు ఆయన వివరించారు.

# ప్రాక్టీస్ చేయని తులసిబాబుకు 48 లక్షల చెల్లింపులు

**విచారణకు ఎసిబికి లేఖ రాస్తామన్న ఉపసభాపతి**



గుంటూరు ఫిబ్రవరి 12 (రిపబ్లిక్ న్యూస్): న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయని కామేపల్లి తులసిబాబును సీఐడీ కేసుల్లో లీగల్ అసిస్టెంట్‌గా నియమించి రూ.48లక్షలు చెల్లించడం సంచలనంగా మారింది. దీనిపై విచారణ కోసం ఏసీబీకి లేఖ రాయనున్నట్లు ఏపీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తెలిపారు. తనపై జరిగిన కస్టోడియల్ టార్చర్ కేసుకు సంబంధించి న్యాయమూర్తి ఎదుట 164 స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు ఆయన బుధవారం గుంటూరు జిల్లా జైలుకు వచ్చారు. కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడిగా ఉన్న తులసిబాబును 2020 అక్టోబరు 6న లీగల్ అసిస్టెంట్‌గా నియమించారని, వాస్తవానికి తులసిబాబు 2021 అక్టోబర్‌లో ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారని రఘురామ తెలిపారు. ఎన్‌రోల్ అయిన మూడు నెలల్లోనే 12 కేసుల్లో సహకరించినందుకు తులసిబాబుకు సీఐడీ రూ.48 లక్షల ఫీజు చెల్లించిందని రఘురామ పేర్కొన్నారు. ఇది తులసిబాబుకు, సీఐడీ మాజీ ఛీఫ్ సునీల్ కుమార్‌కు మధ్య సాన్నిహిత్యాన్ని తెలియజేస్తోందన్నారు. హైకోర్టులోని 12 సీఐడీ కేసుల ట్రయల్ కోసం నియమిస్తున్నట్లు పేర్కొన్నారని, వాస్తవానికి సీఐడీ క్రిమినల్ కేసుల విషయంలో హైకోర్టులో ట్రయల్ ఉండదన్నారు. హైకోర్టులో సీఐడీ కేసుల ట్రయల్ కోసం ప్రభుత్వం నుంచి రూ.కోటి తీసుకొని అవినీతికి పాల్పడ్డారన్న రఘురామ.. దీనిపై విచారణ జరపాలని ఏసీబీని లేఖ ద్వారా కోరనున్నట్లు తెలిపారు.

# ప్రతిసారి తగ్గను..

## నన్ను రాజకీయాల్లోకి లాగొద్దు: విష్వక్సేన్



'లైలా' ప్రీరిలీజ్ ఈవెంట్ లో కమెడియన్ పృథ్వీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీని టార్గెట్ చేసేలా పరోక్షంగా ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా హీరో విష్వక్సేన్, చిత్ర నిర్మాత సాహు గారపాటి స్పందిస్తూ అలా జరిగినందుకు క్షమాపణ చెప్పారు. అయినా సోషల్ మీడియాలో 'బాయ్ కాట్ లైలా' హ్యాష్ ట్యాగ్ ను ట్రెండ్ చేస్తుండటంతో విష్వక్సేన్ మారోసారి స్పందించారు. 'నేను ప్రతిసారి తగ్గను. ప్రీరిలీజ్ ఈవెంట్ లో జరిగిన దానికి క్షమాపణలు చెప్పాను. ఎక్కువగా ఆలోచించవద్దు. ప్రశాంతంగా ఉండండి. మళ్లీ చెపుతున్నా. నేను నటుడిని మాత్రమే. నన్ను, నా సినిమాను రాజకీయాల్లోకి లాగొద్దు' అని విష్వక్సేన్ ట్వీట్ చేశారు.

# విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్'

## పవర్‌ఫుల్ టీజర్ !

టాలీవుడ్ రౌడీబాయ్ విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్ లో 'వీడీ 12' వర్కింగ్ టైటిల్ తో రూపుదిద్దుకుంటున్న కొత్త చిత్రం టీజర్ తాజాగా విడుదలైంది. అలాగే మేకర్స్ ఈ మూవీ టైటిల్ ను కూడా రివీల్ చేశారు. ఈ చిత్రానికి 'కింగ్‌డమ్' అనే పవర్‌ఫుల్ టైటిల్ ను ఖరారు చేశారు. ఇక టీజర్ కు ఎన్టీఆర్ వాయిస్ ఇచ్చిన విషయం తెలిసిందే. తారక్ వాయిస్ తో తాజాగా విడుదలైన టీజర్ మరింత పవర్‌ఫుల్‌గా కనిపించింది. విజయ్ లుక్ కూడా డిఫరెంట్‌గా ఉంది. ఆయన యాక్షన్ ఎపిసోడ్స్, ఎమోషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. మొత్తానికి ఈ టీజర్ తో మేకర్స్ సినిమాపై అంచనాలు పెంచేశారు. జెర్సీ వంటి సూపర్ హిట్ తర్వాత గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ కూడా సమ్‌థింగ్ స్పెషల్‌గా తెరకెక్కినట్లు టీజర్ చూస్తుంటే తెలుస్తోంది. ఇక తమిళ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ బాణీలు అందిస్తున్న కింగ్‌డమ్ సినిమా ఈ వేసవి కానుకగా మే 30న వరల్డ్‌వైడ్ గా విడుదల కానుంది.





# నాన్నతో అకిరా..

## కిర్రాక్ లుక్!

పవన్ కళ్యాణ్ తనయుడు అకిరా నందన్ ఎప్పుడూ మీడియాకు దూరంగా ఉండే వ్యక్తి. కానీ ఎప్పుడైనా తన తండ్రి పవన్ కళ్యాణ్ తో కలిసి కనిపిస్తే, ఆ ఫోటోలు, వీడియోలు వెంటనే వైరల్ అవుతాయి. ఇటీవల ఏపీ ఎన్నికల అనంతరం అకిరా ఎక్కువగా పవన్ తో కలిసి కనిపిస్తున్నాడు. జనసేన విజయంతో అకిరా తన తండ్రితో మరింత క్లోజ్ అయినట్లు అనిపిస్తోంది. తాజాగా పవన్ కళ్యాణ్ దక్షిణాది పర్యటనలో అకిరా కూడా ఆయనతో పాటు వెళ్లాడు. ఈ సందర్భంగా ఆలయ దర్శనాల సమయంలో అకిరా తండ్రితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించాడు. తాజాగా కేరళలోని శ్రీ అగస్త్య మహర్షి ఆలయంలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక పూజలు నిర్వహించిన ఫోటోలు బయటకు వచ్చాయి. ఈ పూజల సమయంలో పవన్ కుమారుడు అకిరా కూడా తన తండ్రితోపాటు ఉన్నాడు. పవన్ కళ్యాణ్ సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా ఈ యాత్ర చేపడతానని ప్రకటించిన విషయం తెలిసిందే. అకిరా కూడా తండ్రికి తోడుగా మౌనంగా పూజలు నిర్వహించడం పవన్ అభిమానులను ఆనందింపజేసింది. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఈ సారి అకిరా లుక్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. గడ్డం పెంచి, ఒప్పుగా స్టైలిష్‌గా తయారైన అకిరా తెల్లటి కుర్తా, ట్రెడిషనల్ లుక్‌లో కనిపించాడు. పవన్ ఫ్యాన్స్ ఆయన్ను చూస్తే తండ్రికి తగ్గ కొడుకు అని అనిపిస్తోంది. అకిరా మునుపటి ఫోటోలతో పోలిస్తే ఇప్పుడు మరింత మ్యాచ్యూర్డ్ లుక్ లో ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం పవన్ తో ఎక్కువగా కనిపిస్తున్న అకిరా త్వరలో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తాడా అనే చర్చలు కూడా సాగుతున్నాయి. అకిరా సినీ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తాడా అనే విషయంలో తల్లి రేణు దేశాయ్ సరైన క్లారిటీ అయితే ఇవ్వలేదు. అతనికి సంగీతం ఇష్టమని, హీరోగా రావడం రాకపోవడం ఇప్పుడే తేల్చలేని విషయమని డౌట్స్ క్రియేట్ చేశారు. ఇక ఆమె అలా వ్యాఖ్యానించినప్పటికీ, అకిరా లేటెస్ట్ లుక్ చూసిన తర్వాత ఫ్యాన్స్ మాత్రం మరోలా ఆలోచిస్తున్నారు.


# వినూత్నంగా తన పెళ్లి డేట్, ప్లేస్ ను

## ప్రకటించిన 'పుష్ప' నటుడు

'పుష్ప' మూవీతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారారు డాలీ ధనుంజయ్. ఈ సినిమాలో జాలిరెడ్డిగా నటించి తన విలనిజంతో ఆకట్టుకున్నారు. అయితే, ఇటీవల తాను ప్రేమించిన ధన్యత అనే అమ్మాయితో ధనుంజయ్‌కి నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. గతేడాది నవంబరులో ఎంగేజ్‌మెంట్ చేసుకున్న ఈ జంట ఇప్పుడు పెళ్లిపీటలు ఎక్కేందుకు సిద్ధమైంది. అయితే, తన పెళ్లి డేట్, ప్లేస్ ను ధనుంజన్ ఇన్‌స్టా వేదికగా వినూత్నంగా ప్రకటించారు. తాను క్లాప్ కొట్టే బోర్డుతో కనిపించగా... తన భార్య డాక్టర్ గా స్టెతస్కోప్ పట్టుకుని ఉన్న ఫొటోలను షేర్ చేశారు. అలాగే తమ వివాహం మైసూర్ లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో జరగబోతున్నట్లు తెలిపారు. చిన్నప్పటి నుంచి చదువుకున్న ఊరు కావడంతో అక్కడే పెళ్లి చేసుకోవాలని ధనుంజయ్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇక ఈ జంటకు ఫిబ్రవరి 15, 16 తేదీల్లో పెళ్లి జరగనుంది. ఈ విషయాన్ని నటుడు తన ఇన్‌స్టా పోస్టులో పేర్కొన్నారు. కాగా, చిత్రదుర్గ ప్రాంతానికి చెందిన ధన్యత వైద్యురాలు. ఈ ఇద్దరికీ చాలా కాలంగా పరిచయం ఉంది. అది కాస్త ప్రేమగా మారడంతో ఇప్పుడు పెళ్లిబంధంలోకి అడుగుపెడుతున్నారు.



# కాక పుట్టించే బ్యూటీ క్రేజీ ఛాన్సులకు దూరంగా!



యంగ్ బ్యూటీ ఇవానా గురించి పరిచయం అవసరం లేదు. అమ్మడు 'లవ్ టుడే' సినిమాతో తెలుగు నాట బాగా ఫేమస్ అయింది. యూత్ ఫుల్ లవ్ స్టోరీతో యువతకి బాగా రీచ్ అయింది. 'లవ్ టుడే' తమిళ అనువాద చిత్రమైనా సక్సెస్ ఆమెకు మంచి గుర్తింపును తీసుకొచ్చింది. దీంతో తెలుగులో మంచి కెరీర్ ఉంటుందని అంతా భావించారు. కానీ అమ్మడి కెరీర్ మాత్రం అలా సాగడం లేదు. 'లవ్ టుడే' తర్వాత తెలుగులో ఓ సినిమాకి సైన్ చేసింది. దిల్ రాజు తమ్ముడు కుమారుడు అశిష్ రెడ్డి హీరోగా మొదలైన ప్రాజెక్ట్ ఇది. అయితే ఈసినిమా ప్రారంభమై చాలా కాలమవుతుంది. ఇంకా ఈ సినిమా సెట్స్ లోనే ఉంది. దిల్ రాజుసొంత నిర్మాణ సంస్థలోనే పట్టాలెక్కించిన చిత్రమిది. అయితే ఇదే సమయంలో రాజుగారు కొన్ని భారీ బడ్జెట్ చిత్రాలు కూడా పట్టా లెక్కించారు. దీంతో నిర్మాణ పరంగా ఇబ్బందులు తలెత్తడంతో సెల్ఫిష్ ని తాత్కాలికంగా వాయిదా వేసారు. అయితే ఈ వాయిదా అన్నది అశిష్ సహా ఇవానా కెరీర్ పై కూడా ప్రభావం పడింది. ఇద్దరు ఆ ప్రాజెక్ట్ బాండ్ అయి ఉన్నారు. కొత్త సినిమా అవకాశాలు రాకపోవడంతో గ్యాప్ ఏర్పడింది. అశిష్ సంగతి పక్కన బెడితే? ఇవానాకి తెలుగులో మంచి క్రేజ్ ఉంది. నటిగా తొలి సినిమాతోనే ప్రూవ్ చేసుకుంది. ఈనేపథ్యంలో తెలుగులో పెద్ద హీరోయిన్ అవుతుంది అన్న అంచనాలు సైతం తెరపైకి వచ్చాయి. కానీ సెల్ఫిష్ ఇంకా సెట్స్లోనే ఉండటతో కొత్త ఛాన్సులు రాలేదు. అటు తమిళ్ లో కూడా అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది ఒక్క సినిమాతోనే ప్రేక్షకుల ముందు కొచ్చింది. మాలీవుడ్ లో కూడా సినిమాలు చేయలేదు. తొలుత కెరీర్ అక్కడే ప్రారంభించింది. అటుపై మరింత మెరుగైన కెరీర్ కోసం కోలీవుడ్ లో లాంచ్ అయింది. అక్కడ బాగానే ఫేమస్ అయింది. అక్కడ నుంచి టాలీవుడ్ కి షిఫ్ట్ అయితే మొదటి కే మోసం వచ్చింది. ఇలా ఇవానా కెరీర్ డే బై డే మరింత నెమ్మదిస్తుంది

# మా తాత రసికుడు

## : చిరంజీవి వ్యాఖ్యలు వైరల్

సరదా కామెంట్లు చేయడంలో మెగాస్టార్ చిరంజీవి ఎప్పుడూ ముందుంటారు. నిజ జీవితంలో కూడా ఆయన ఎంతో సరదాగా ఉంటారు. తాజాగా ఆయన మరోసారి అందరినీ కడుపుబ్బ నవ్వించారు. బ్రహ్మానందం, ఆయన కుమారుడు గౌతమ్ కలిసి నటించిన 'బ్రహ్మ ఆనందం' ప్రీరిలీజ్ ఫంక్షన్ కార్యక్రమానికి చిరంజీవి హాజరయ్యారు. ఈ ఫంక్షన్ లో తాత గురించి మాట్లాడాలని చిరంజీవిని యాంకర్ సుమ అడిగారు. దీంతో ఆయన మాట్లాడుతూ... నీకు ఎవరి బుద్ధులు వచ్చినా పర్వేదు కానీ, మీ తాత బుద్ధులు మాత్రం రాకూడదని మా అమ్మ తరచూ చెప్పేదని తెలిపారు. ఎందుకంటే తమ తాత మహా రసికుడని, తనకు ఇద్దరు అమ్మమ్మలని సరదాగా చెప్పారు.



# గ్రామాలకు ప్రగతి కళ!



**కర్నూలు జిల్లాలో రూ.131.28 కోట్లతో గోకులాలు, ఫారం పాండ్లు, ఉద్యాన తోటల పెంపకం, సిసి రోడ్ల నిర్మాణం**

**రైతుల జీవన ప్రమాణాలు మరియు నికర ఆదాయ మార్గాల పెంపుదల కార్యక్రమాల అమలు**

**కర్నూలు, ప్రతినిధి ఫిబ్రవరి 12:( రిపబ్లిక్ న్యూస్)**

పల్లె సీమల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. పల్లెలకు పూర్వ వైభవం తీసుకురావాలనే ఆలోచనతో కూటమి సర్కార్... 'పల్లె పండుగ' పేరుతో రాష్ట్రంలో నూతన కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల అభివృద్ధికి ఒక కీలక ముందడుగు వేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024 ఆగస్టు 23 న కర్నూలు జిల్లాలోని 484 పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించి పల్లె సీమలలో గోకులాలు, ఉద్యాన పండ్ల తోటల పెంపకం, ఫారం పాండ్లు, సిసి రోడ్ల నిర్మాణాల పనులు చేపట్టాలని నిర్ణయించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉపాధి హామీ పథకం ద్వారా కర్నూలు జిల్లాలో రూ.131.28 కోట్లతో గోకులాలు, ఫారం పాండ్లు, ఉద్యాన పండ్ల తోటల పెంపకం, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడానికి జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా శరవేగంగా పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేశారు. ఈ మేరకు గ్రామాలలో సుస్థిర ఆస్తుల కల్పన నిమిత్తం విస్తృతంగా పనుల అమలుకు జిల్లా యంత్రాంగాన్ని వేగవంతం చేశారు. డ్వామా మరియు పంచాయతీరాజ్ శాఖలను సమన్వయపరిచి గ్రామీణ ప్రాంతంలో రైతుల జీవన ప్రమాణాలు మరియు నికర ఆదాయ మార్గాల పెంపుదల కార్యక్రమాల అమలును ముమ్మరం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గోకులాలు, ఫారం పాండ్లు, పండ్ల తోటల పెంపకం, సీసీ రోడ్ల నిర్మాణం పనులను ప్రభుత్వం చేపట్టడంతో రైతులు, ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

మాకు ఉన్న మూడు ఎకరాలలో ఉపాధి హామీ పథకం ద్వారా మామిడి పండ్ల మొక్కలు నాటడానికి గుంతలు తీయించారు, అనంతరం ప్రభుత్వం వారే మొక్కలను, మొక్కలకు అవసరమైన ఎరువులను, సరఫరా చేశారు, మా పొలమును దున్నుకోవటానికి ఎకరా కు 1000 రూపాయల చొప్పున నగదును కూడా ఇచ్చారు.. చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు




**చాకలి సుంకన్న, రైతు, పొట్లపాడు గ్రామం, దేవనకొండ మండలం, కర్నూలు జిల్లా.**

## పాడి రైతుల కోసం గోకులాలు


రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల ప్రయోజనార్థం గోకులం నిర్మాణాలను చేపట్టింది.. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులు తమ స్థలం అనుకూలతను బట్టి గోకులం నిర్మాణానికి రెండు పశువులు ఉన్నవారికి యూనిట్ ధర రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు కలిగిన వారికి రూ.1.85 లక్షలు, ఆరు పశువులు కలిగిన వారికి రూ.2.30 లక్షలు ఉపాధి మెటీరియల్ నిధులు మంజూరు చేశారు. ఇందులో కేవలం రైతులు 10 శాతం భరించగా, మిగిలిన 90 శాతం ఉపాధి నిధుల నుంచి మంజూరు చేశారు. అదేవిధంగా 20 గొర్రెలు/మేకలకు షెడ్లు వేసుకునే వారికి యూనిట్ ధర రూ.1.30 లక్షలు, 50 గొర్రెలు/మేకలు కలిగిన వారికి రూ.2.30లక్షలు, అలాగే కోళ్ల ఫారాలకు 100 కోళ్లు పెట్టుకున్న వారికి షెడ్డు నిర్మాణానికి ఒక యూనిట్ కు రూ.87 వేలు, 200 కోళ్లు ఉన్నవారికి రూ.1.32 లక్షలు మంజూరు చేశారు. మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం దారులకు 70 శాతం రాయితీతో ఉపాధి నిధులను మంజూరు చేశారు. జిల్లాలో మొత్తంగా 1020 షెడ్ల నిర్మాణానికి రూ.21.92 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి.. ఇప్పటికే 605 షెడ్లు నిర్మాణం పూర్తికాగా... మిగిలినవి తుది దశలో ఉన్నవి.

## ఫారం పాండ్లు, ఉద్యాన తోటల పెంపకం

అలాగే జిల్లాలో రూ.4.5 కోట్ల అంచనాతో 1252 ఫారం పాండ్లు మంజూరు కాగా... 274 పనులు చేపట్టి ఇప్పటికే 53 పనులను పూర్తి చేశారు. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. సన్న చిన్న కారు రైతుల సుస్థిర అభివృద్ధి కోసం రూ.37.36 కోట్ల అంచనాతో 4152 ఎకరాలలో 100 శాతం రాయితీతో మామిడి, సపోటా, చీని, నిమ్మ తదితర పండ్ల తోటల పెంపకం పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగింది. పల్లె పండుగ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఉపాధి హామీ నిధులతో రూ.67.58 కోట్లతో గ్రామాలలో సిమెంట్ రహదారులు, బీటి రహదారులు, డబ్ల్యూబిఎం రహదారులు, ప్రహరీ గోడల నిర్మాణం తదితర పనులకు సంబంధించి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 830 పనులలో... 790 పనులు పూర్తి చేయడం జరిగింది. మిగిలిన పనులు త్వరలో పూర్తి కానున్నాయి.

### ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధి

జిల్లాలో గ్రామాభివృద్ధికి తోడ్పడే పనులను ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేయడం జరుగుతోంది..గోకులం నిర్మాణాలు, ఫారం పాండ్స్, ఉద్యాన తోటల పెంపకం,సీసీ రోడ్లు తదితర పనులను చేపట్టడం జరుగుతోంది..ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పనుల కల్పన ద్వారా ఇప్పటి వరకు వేతనాల రూపంలో రూ.211 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.73 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో రోడ్ల నిర్మాణంతో పాటు రైతుల నికర ఆదాయ మార్గాల పెంపుదల దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.



## మినీ గోకులం పాడి రైతులకు వరం

**మహబూబ్ బాషా, తడకనపల్లి గ్రామం, కల్లూరు మండలం, కర్నూలు**

మా సొంత స్థలంలో 6 పశువులకు మినీ గోకులం నిర్మించుకున్నా..యూనిట్ విలువ 2,30,000 కాగా, ఉపాధి హామీ పథకం కింద 90% సబ్సిడీతో 2,07,000 రూపాయలు మంజూరు చేశారు..23,000 రూపాయలు రైతు వాటా కింద జమచేసి మినీ గోకులం నిర్మాణం పూర్తి చేశాను..ఇంతకుముందు నా వద్ద ఉన్న గేదెలు మరియు ఆవులన్నీ కూడా చెట్టు కింద ఖాళీ స్థలంలో కట్టివేసేవాడిని అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఇబ్బంది పడుతూ ఉండేవి..వాటి ఆరోగ్యం పాడైపోతూ ఉండేది. అంతేకాకుండా పాల దిగుబడి కూడా తక్కువగా ఉండేది. ఇప్పుడు మినీ గోకులం నిర్మాణం పూర్తయిన తర్వాత పశువులు పరిశుభ్రమైన మరియు ప్రశాంతమైన వాతావరణంలో ఉండడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా పాల దిగుబడి కూడా సుమారుగా ఒక్కొక్క పశు వు కి రెండు లీటర్ల చొప్పున పెరిగినాయి, అలాగే పశువులు పాము కాటుకి గురికాకుండా మరియు క్రిమి కీటకాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉన్నాయి. మినీ గోకులంలో నీటి తొట్లు ఏర్పాటు చేసినందువల్ల అవి పుష్కలంగా నీరు తాగుతూ ఆహారం బాగా తీసుకుంటూ ఆరోగ్యంగా ఉన్నాయి. అలాగే మినీ గోకులంలో ఫ్యాన్లు ఏర్పాటు చేయడం వల్ల దోమలు మరియు ఈగల బెడద తప్పి పశువుల ఆరోగ్యంగా ఉన్నాయి. అలాగే పశువులు పోసిన మూత్రము, పశువులను కడిగిన నీరు అంతా కూడా గోకులం షెడ్ లోని కాలువల ద్వారా వెంటనే బయటికి పోవడం వల్ల షెడ్ లో తేమ లేకుండా పొడిగా ఉండి శుభ్రంగా ఉంటున్నాయి దాని వలన పొదుగు వాపు వ్యాధి రావడం కూడా తగ్గింది.నా పశువులకు ఇంత మేలు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ మరియు ఉపాధి హామీ పథకం వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

## కూటమి ప్రభుత్వంలో గ్రామాలలో సిసి రోడ్లు

గ్రామాలలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలోని రహదారులను నిర్మించి గ్రామాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు..మా గ్రామంలో బోయ మద్దిలేటి ఇంటి నుండి మసీదు వరకు సిసి రోడ్ ను నిర్మించారు..రోడ్ వేయడం వలన చాలా సౌకర్యంగా ఉందని ఓర్వకల్లు మండల కేంద్రానికి చెందిన రఘురాముడు, సుబ్బరాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు..



## తాగునీరు, పారి శుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

**తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి సంపద సృష్టిపై అవగాహన కల్పించండి**

నంద్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 12, రిపబ్లిక్ న్యూస్ :- జిల్లాలో తాగునీరు, పారి శుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛత పాటించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో తాగునీరు, పారి శుధ్యం, స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ గ్రీన్ లీఫ్ రేటింగ్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.లిఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో తాగునీరు, పారి శుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సంపద సృష్టించే అంశాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటి నుండి సేకరించిన తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంతో పాటు తడి చెత్తతో వర్మీ కంపోస్టు, పొడి చెత్తతో పేపర్ ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేసే సంపద తయారీ కేంద్రాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకాలలో నిర్వహణ లోపం లేకుండా క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పైప్ లైన్లలో మరమ్మత్తులు, ఇతర రిపేర్లు ఏమైనా ఉంటే 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసి కిచెన్ గార్డ్ ప్రమోట్ చేసేందుకు గుర్తించాలన్నారు.




అగ్రికల్చర్, హార్టికల్చర్ ఏపీసిఎన్ఎఫ్ ల భాగస్వామ్యంతో కిచెన్ గార్డ్ ల పెంపకం ముమ్మరంగా చేపట్టాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీ మూడవ శనివారం ప్రతి కార్యాలయం, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ స్థలాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛగ్రీన్ లీఫ్ రేటింగ్ కు సంబంధించి పర్యాటక ప్రదేశాలు, హొటల్స్ అసోసియేషన్ లతో సమావేశాలు నిర్వహించి డాక్యుమెంట్ తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సమాధి అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# రంజాన్ మాసంలో ఉద్యోగులకు గంట ముందస్తు అనుమతి

**మార్చి 2 నుంచి 30 తేదీ వరకు అనుమతి : సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మైనారిటీ మంత్రి ఫరూక్**

అమరావతి ఫిబ్రవరి 12( రిపబ్లిక్ న్యూస్):
రంజాన్ పవిత్ర మాసంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులందరూ సాయంత్రం పనివేళల ముగింపు కంటే ఒక గంట సమయం ముందుగానే బయటకు వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. అమరావతిలో ప్రభుత్వ నిర్ణయాన్ని వెల్లడిస్తూ గంట సమయం ముందస్తు అనుమతి విషయాన్ని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బంది, గ్రామ వార్డు సచివాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ముస్లిం ఉద్యోగులందరికీ గంట సమయం ముందుగానే బయటకు వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర



మాసంలో మార్చి 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇస్లాం మతాన్ని ఆచరించే అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు వారి కార్యాలయాలు/ పాఠశాలలను ఒక గంట సమయం ముందుగానే వీడడానికి అనుమతులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి వెల్లడించారు. ఈ మేరకు సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖల విభాగ అధిపతులకు, జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా మార్గదర్శకాలు అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. రంజాన్ మాసంలో ఒక గంట ముందుగా ప్రభుత్వ శాఖల్లో పని చేసే ముస్లిం ఉద్యోగులు మతపరమైన ఆచారాలు నిర్వహించుకోవడానికి బయటకు వెళ్లేందుకు అనుమతించే నిర్ణయం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com